



కబడ్డీ ఆడుతున్న జిల్లా ఎస్పీ జగదీష్

మత్తుకు దూరంగా ఉండండి: ఎస్పీ

విడపనకల్లు, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): యువత మత్తు పదార్థాలకు బానిసలు కాకుండా జాగ్రత్త పడాలని జిల్లా ఎస్పీ జగదీష్ సూచించారు. మండలంలోని పాల్తూరు గ్రామంలో పోలీస్ మైత్రి సంఘం ఆధ్వర్యంలో రెండు నియోజకవర్గాలకు చెందిన క్రీడాకారులకు కబడ్డీ పోటీలను శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎస్పీ ముఖ్య అతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. సరదాగా కాసేపు కబడ్డీ ఆడారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సరదాగా మొదలైన మత్తు పదార్థాల వినియోగం వ్యసనంగా మారుతుందన్నారు. అందుకే యువత వీటికి దూరంగా ఉండాలన్నారు. క్రీడల్లో పాల్గొనటం వల్ల మానసిక ఉల్లాసం పెరిగి ఆరోగ్యవంతులుగా ఉంటారని తెలిపారు. కాగా గ్రామంలో గజ గౌరీ జాతర సందర్భంగా రాయదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాలకు చెందిన వివిధ గ్రామాల క్రీడాకారులకు కబడ్డీ పోటీలు నిర్వహించారు. ఇందులో 60 జట్లు పాల్గొన్నాయి. కార్యక్రమంలో గుంతకల్లు డీఎస్పీ శ్రీనివాసులు, సీఐలు సురేష్‌బాబు, చిన్నగౌస్, ఎస్ఐలు మురాహరి బాబు, టీడీపీ నాయకులు గడ్డం మారయ్య, కాలువ మారయ్య, గిడ్డ మారయ్య, తిప్పారెడ్డి, వన్నూరు స్వామి తదితరులు పాల్గొన్నారు.

- జిల్లా ఎస్పీని మండల టీడీపీ నాయకులు పూలమాలలు, శాలువతో ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన పాల్తూరు స్టేషన్ చేరుకుని రికార్డులను పరిశీలించారు. అనంతరం సమస్యలను అడిగి తెలుసుకున్నారు.



కసాపురంలో ఉత్సవ మూర్తులు



ప్రత్యేక అలంకరణలో బొలికొండ రంగనాథ స్వామి



నేమకల్లు ఆంజనేయస్వామి

వెండి రథ ప్రాకారోత్సవం

గుంతకల్లు, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): కార్తీక శనివారాన్ని పురస్కరించుకుని నెట్టికంటి ఆంజనేయస్వామి దేవాలయంలో స్వామివార్లకు వెండిరథ ప్రాకారోత్సవాన్ని నిర్వహించారు. సీతారామలక్ష్మణ సహిత ఆంజనేయస్వామి వార్ల ఉత్సవ విగ్రహాలను సర్వాంగసుందరంగా అలంకరించారు.

రంగనాథా.. పాహిమాం..

గుత్తి రూరల్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): తొండపాడులో వెలసిన బొలికొండ రంగనాథ స్వామికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్తీక మాసం సందర్భంగా స్వామి వారికి వేకువజామున పంచామృతాభిషేకం చేసి, వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. భక్తులు ఆకు పూజలను నిర్వహించుకున్నారు. పెద్ద ఎత్తున తరలివచ్చిన భక్తులకు అన్నదానం చేశారు.

విశేష పూజలు

బొమ్మనహాళ్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): నేమకల్లు ఆంజనేయ స్వామి వారికి కార్తీకమాసం సందర్భంగా శనివారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవ, పంచామృతాభిషేకం, నిర్మల్య విసర్జన, విష్ణుపారాయణం, అష్టోత్తర పూజలు నిర్వహించారు. స్వామివారికి వెండి కవచ, పుష్పాలంకరణ చేశారు. నైవేద్యం సమర్పించిన అనంతరం మహామంగళహారతి ఇచ్చారు. భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం కార్తీక దీపోత్సవం, కార్తీక పురాణం పఠనం, ఆకాశదీపం వేడుకలను నిర్వహించారు.

సమ్మె ఒప్పందాన్ని అమలుచేయాలి

సీఐటీయూ, అంగన్వాడీ యూనియన్



ధర్నాలో మాట్లాడుతున్న సీఐటీయూ నాగేంద్ర

అనంతపురం విద్య, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని, సమ్మె ఒప్పందాలను అమలు చేయాలని సీఐటీయూ, అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ నేతలు డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం శనివారం కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. ప్రతి 300 కుటుంబాలకు ఒక మినీ సెంటర్ ఉండాల్సి ఉండగా, 1500 కుటుంబాలకు ఒక మినీ కేంద్రాన్ని నిర్వహిస్తున్నారని, మినీ వర్కర్లను బానిసలుగా చూస్తున్నారని సీఐటీయూ జిల్లా ప్రధానకార్యదర్శి నాగేంద్ర మండిపడ్డారు. వెంటనే మినీ కేంద్రాలను మెయిన్ కేంద్రాలుగా మార్చాలని డిమాండ్ చేశారు. గతంలో అంగన్‌వాడీలు 42 రోజులు సమ్మె చేశారని, ఆ సమ్మె విరమణ తర్వాత చేసుకున్న ఒప్పందాన్ని ఈ ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని అన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలను నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని, గ్రేడ్-2 సూపర్‌వైజర్ పోస్టులలో మినీ అంగన్‌వాడీ వర్కర్లకూ అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. వేతనాలు పెంచాలని, సర్వీసులో ఉండి చనిపోయిన వారికి అంత్యక్రియలకు సాయం అందించే జీవోను వెంటనే అమలు చేయాలని కోరారు. సంబంధం లేని పనులను సైతం యాప్స్ ద్వారా చేయించాలని చూస్తున్నారని మండిపడ్డారు. వెంటనే పనిభారం తగ్గించాలని కోరారు. సీఎం చంద్రబాబు ఎన్నికల ముందు ఇచ్చిన అనేక హామీలను వెంటనే అమలు చేయాలని కోరారు. లేదంటే ఉద్యమాన్ని కొనసాగిస్తామని హెచ్చరించారు. ధర్నా అనంతరం కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్‌కు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ నేతలు శకుంతల, రమాదేవి తదితరులు పాల్గొన్నారు

అయ్యో.. దేవుడా..!

తెల్లవారితే నిశ్చితార్థం

బైకును ఢీకొన్న బండల ట్రాక్టర్

యువతి మృతి.. తమ్ముడికి తీవ్ర గాయాలు



ప్రమాద స్థలంలో గీతావాణి మృతదేహం



గీతావాణి (ఫైల్)

తాడిపత్రి, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): కూతురు నిశ్చితార్థానికి సిద్ధమైన ఆ కుటుంబంలో పెను విషాదం చోటు చేసుకుంది. వెంకటరెడ్డిపల్లి సమీపంలో శనివారం రాత్రి బైక్‌ను ట్రాక్టర్ ఢీకొట్టడంతో యువతి గీతావాణి(24) అక్కడికక్కడే మృతిచెందింది. ఆమె తమ్ముడు నారాయణరెడ్డి తీవ్రంగా గాయపడ్డాడు. వెంకటరెడ్డిపల్లికి చెందిన శ్రీరామిరెడ్డి, లక్ష్మీదేవి దంపతులకు ఇద్దరు కూతుళ్లు.. ఒక కుమారుడు. పెద్ద కూతురు గీతావాణి పెళ్లి కుదిరింది. తాడిపత్రి పట్టణంలోని నంద్యాల రోడ్డులో ఉన్న ఎస్ఎల్‌వీ ఫంక్షన్ హాలులో ఆదివారం నిశ్చితార్థం జరగాల్సి ఉంది. ఈ క్రమంలో వ్యక్తిగత పని నిమిత్తం గీతావాణి తన తమ్ముడు నారాయణరెడ్డితో కలిసి బైక్‌పై తాడిపత్రికి వచ్చింది. పని ముగించుకుని రాత్రి 8:30 గంటల సమయంలో తిరిగి స్వగ్రామానికి బయలుదేరారు. రోడ్డు దాటుతుండగా నాపరాతి బండలలోడుతో తాడిపత్రికి వస్తున్న ట్రాక్టర్ వీరిని ఢీకొట్టింది. ట్రాక్టర్ గీతావాణిపై దూసుకెళ్లడంతో శరీరం ఛిద్రమై ఆమె అక్కడికక్కడే మృతిచెందింది. తీవ్రంగా గాయపడిన ఆమె తమ్ముడు నారాయణరెడ్డిని అనంతపురం తరలించారు. రూరల్ సీఐ శివగంగాధర్ రెడ్డి ప్రమాద స్థలాన్ని సిబ్బందితో కలిసి పరిశీలించారు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగి.. రైతు బిడ్డ..

శ్రీరామిరెడ్డి వ్యవసాయం చేసుకుంటూ తన ముగ్గురు బిడ్డలను చదివించారు. కూతుళ్లు గీతావాణి, బిందు బాగా చదివి సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లయ్యారు. నారాయణరెడ్డి బీటెక్ పూర్తిచేసి ఉద్యోగ అన్వేషణలో ఉన్నాడు. గీతావాణికి ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగితో వివాహం కుదిరింది. నిశ్చితార్థానికి రెండు కుటుంబాలవారు సిద్ధమయ్యారు. అందరూ సంబరాలకు సిద్ధమౌతుండగా.. రోడ్డు ప్రమాదం పెను విషాదాన్ని నింపింది. ప్రమాదం గురించి తెలియగానే గ్రామస్థులు తీవ్ర ఆవేదనకు లోనయ్యారు. అందరూ ప్రమాద స్థలానికి వెళ్లారు. విగతజీవిగా ఉన్న కూతురును చూసిన తల్లిదండ్రులు శ్రీరామిరెడ్డి, లక్ష్మీదేవి గుండెలవిసేలా రోదించారు. 'పెళ్లిచేసి అత్తవారింటికి పంపాలనుకున్నాం కదమ్మా... ఇంతలోనే ఎంతపని జరిగింది..' అంటూ తల్లిదండ్రులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపించారు. ఆ ప్రాంతంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

పొద్దున వస్తేనే వైద్యం...!

మధ్యాహ్నం దాటితే అందుబాటులో ఉండని వైద్యులు



శింగనమల కమ్యూనిటీ ఆసుపత్రి

శింగనమల మండలకేంద్రంలోని కమ్యూనిటీ ఆస్పత్రిలో వైద్యులు సక్రమంగా ఉండకపోవడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 30 పడకల సామర్థ్యం కలిగిన ఈ ఆస్పత్రిలో ఉదయం పూట మాత్రమే డాక్టర్లు ఉంటున్నారు. మధ్యాహ్నం దాటిందంటే నర్సులే దిక్కు. ఇక రాత్రి సమయంలో ఏ రోగమని వచ్చినా అనంతపురం వెళ్లండి అని అక్కడున్న సిబ్బంది ఉచిత సలహా ఇస్తారు. ఇది పేరుకే 24 గంటల ఆస్పత్రి అని, వైద్యులు ఉండకపోతే ఏమి ప్రయోజనమని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. - ఆంధ్రజ్యోతి, శింగనమల

రాత్రి పూట ఏ సమస్య వచ్చినా జిల్లాకేంద్రానికి రెఫర్

అరకొర మందులు ఇస్తున్న నర్సులు

శింగనమల కమ్యూనిటీ ఆస్పత్రి పనితీరుపై విమర్శలు

ఓపీ 200పైనే...

ఈ ఆస్పత్రికి రోజు దాదాపు 200 మంది రోగులు వస్తున్నట్లు ఓపీ రికార్డులు చెబుతున్నాయి. సీజనల్ వ్యాధుల కాలంలో ఇది 300కు పైగానే ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. సాధారణంగా ఆస్పత్రిలో ఉదయం పూట నలుగురైదుగురు వైద్యులు అందుబాటులో ఉంటారు. మధ్యాహ్నం దాటితే ఒక్కరూ ఉండరు. దీంతో మధ్యాహ్నం తరువాత వచ్చే రోగులకు డ్యూటీలో ఉన్న నర్సు చికిత్స చేయాల్సిందే. ఏదైనా అత్యవసర కేసులు వస్తే అనంతపురం రెఫర్ చేసి పంపుతారు. రాత్రి సమయంలో కనీసం సూది మందు కూడా అందుబాటులో ఉండదని, మాత్రలు కూడా తక్కువగానే ఇస్తారని పలువురు రోగులు చెబుతున్నారు.



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులు

రాత్రి పూట డాక్టర్ ఉండాలి

రాత్రి సమయంలో అనారోగ్యంతో ఆస్పత్రికి వస్తే ఒక్క డాక్టర్ కూడా ఉండటం లేదు. ఒక నర్సు మాత్రమే ఉంటుంది. ఆమె ఏవో కొన్ని మాత్రలు మాత్రమే ఇస్తారు. చిన్న సమస్యతో వెళ్లినా అనంతపురం పొమ్మంటారు. ఆస్పత్రిలో రాత్రి పూట డాక్టర్ అందుబాటులో ఉంటే సమస్య తీరుతుంది.



- బోయ నరేష్

ఆన్ కాల్ డ్యూటీ మాత్రమే ఉంది

ఈ ఆస్పత్రిలో రాత్రి సమయంలో వైద్యులకు ఆన్ కాల్ డ్యూటీ మాత్రమే ఉంది. ఆసుపత్రి నుంచి రోగులకు ఎమర్జెన్సీ ఉంటే అక్కడ సిబ్బంది ఫోన్ ద్వారా సమాచారం ఇస్తారు. దీంతో డాక్టర్లు అక్కడికి వెళ్లి చికిత్స అందిస్తారు. ఆస్పత్రిలో ఎలాంటి మందుల కొరత లేదు. రాత్రి సమయంలో కూడా అవసరమైన మాత్రలు, ఇంజక్షన్లు అందుబాటులో ఉన్నాయి.

- డాక్టర్ ప్రవీణ్‌కుమార్

మాత్రల కొరత

రాత్రి సమయంలో రోగులు చికిత్స కోసం వస్తే అరకొరగా మాత్రలు ఇచ్చి పంపుతున్నారు. కొన్ని సమయంలో అర్ధ మాత్రే ఇస్తున్నారు. రాత్రి సమయంలో అవసరమైన సూది మందులు, మాత్రలు అందుబాటులో ఉంచాలి. వైద్యులు 24 గంటు ఆసుపత్రిలో ఉండేలా స్థానిక ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకోవాలి.



- ఎర్రిస్వామి

విద్యాశాఖలో అదే వాసన..!

ప్రభుత్వం మారినా తీరు మారలేదు

చక్రం తిప్పుతున్న వైసీపీ వర్గ టీచర్

ఏఎస్‌ఓ పోస్టు కోసం పైరవీలు



డీఈఓ ఆఫీస్

అనంతపురం విద్య, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): జిల్లా విద్యాశాఖలో ఇప్పటికీ 'వైసీపీ' టీచర్లదే రాజ్యం. కూటమి ప్రభుత్వం ఏర్పడినా మార్పు లేదు. గతంలో విద్యాశాఖ, సమగ్రశిక్ష ప్రాజెక్టులో అడ్డగోలుగా వ్యవహరించిన ఆ పార్టీ వీరవిధేయులు ఇప్పుడు కూడా చక్రం తిప్పాలని చూస్తున్నారు. విద్యాశాఖలో అత్యంత కీలకమైన ఏఎస్ఓ పోస్టుపై కన్నేశారు. ఎలాగైనా ఆ పోస్టును సొంతం చేసుకోవాలని అక్కడ పనిచేస్తున్న ఓ టీచర్ విశ్వప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. ఆయన చేసిన అక్రమాలు అన్నీ ఇన్నీ కావు. ఐటీ సెల్‌లోని ఈ కిలాడీ టీచర్ అక్రమాలకు, అరాచకాలకు అంతే లేకుండా పోతోంది. గత ఏడాదిలో జరిగిన టీచర్ల బదిలీలు, సర్దుబాటులో ఆయన చేసిన అక్రమాలపై విచారణ చేయిస్తే... అన్నీ బయటపడుతాయని డీఈఓ ఆఫీస్ సిబ్బంది, సంఘాల నాయకులే బాహటంగా చర్చించుకుంటున్నారు.

మామూలోడు కాదు..

ఆర్‌జేడీ శామ్యూల్ గతంలో జిల్లా విద్యాశాఖాధికారిగా పనిచేశారు. ఆయన కాలంలో సమగ్రశిక్ష ప్రాజెక్టులోకి సదరు టీచర్ డెప్యుటేషన్‌పై అడ్డగోలుగా వచ్చాడు. వచ్చీ రాగానే ఆయనకు సర్వీస్ పేరుతో దగ్గరయ్యాడు. తర్వాత కొంతకాలానికి డీఈఓ ఆఫీస్‌లోని ఓ కీలక పోస్టులోకి రావాలని ప్రయత్నించాడు. సార్ వద్ద ఉన్న చనువుతో మూడేళ్ల కిందట ఐటీ సెల్‌లోకి ప్రవేశించాడు. ఇక డెప్యుటేషన్లు, వర్క్ అడ్జస్టుమెంట్లలో తల దూర్చి వసూళ్లు చేయడం ప్రారంభించాడు. వసూళ్లలో వాటా ఇస్తూ.. సార్‌కు మరింత దగ్గరవుతూ వచ్చాడన్న ప్రచారం జరిగింది. ఆ తర్వాత కొత్త డీఈఓలుగా ఎవరు వచ్చినా మాయ మాటలు, మామూళ్లతో ప్రసన్నం చేసుకున్నాడని చెబుతారు. వైసీపీ ప్రభుత్వంలో డీఈఓ ఆఫీస్‌లోకి వచ్చిన ఆయన... మూడేళ్ల బాగా హల్‌చల్ చేశాడు. గతంలో ఆయనకు ప్రిన్సిపల్ సెక్రటరీ సైతం అక్షింతలు వేశారు. 'ఏంటి..? స్కూల్‌కు వెళ్లి పాఠాలు చెప్పకుండా.. ప్రిన్సిపల్ సెక్రటరీ వచ్చినపుడు ఇడ్లీ, సాంబార్ అందిస్తే సరిపోతుందా..?' అని చీవాట్లు పెట్టారు. కానీ అప్పటి డీఈఓ వైఖరి వల్ల ఆయన బయటపడ్డాడు. కూటమి ప్రభుత్వంలో మళ్లీ పావులు కదుపుతున్నాడని సమాచారం. ఈ సారి ఎలాగైనా డీఈఓ ఆఫీస్‌లోని అత్యంత కీలకమైన అసిస్టెంట్ స్టాటికల్ ఆఫీసర్(ఏఎస్ఓ) పోస్టును సొంతం చేసుకోవాలని చూస్తున్నాడు. ఇప్పటికే ప్రయత్నాలు ముమ్మరం చేశారు.

రెగ్యులర్ స్టాఫ్‌కు చుక్కలు

ఐటీ సెల్‌లోని ఈ టీచర్.. డీఈఓ ఆఫీస్‌లోని రెగ్యులర్ స్టాఫ్‌కు చుక్కలు చూపిస్తున్నాడు. ఆఫీస్‌లో డీఈఓ తర్వాత ఏడీలు, సూపరింటెండెంట్లు, సీనియర్ అసిస్టెంట్లు కీలకం. వారిని సైతం ఈ టీచర్ లెక్కచేయడం లేదు. ఇష్టారాజ్యంగా, అమర్యాదగా మాట్లాడుతున్నాడని బాధితులు వాపోతున్నారు. డీఈఓతో ఏదైనా ఫైళ్ల విషయంపై మాట్లాడుతామన్నా... ఆయన నిత్యం డీఈఓ పక్కనే కుర్చీ వేసుకుని కూర్చుంటున్నాడని, ప్రతి దాంట్లో తలదూరుస్తున్నాడని వాపోతున్నారు. కార్యాలయంలో జరిగే ప్రైగా ప్రతి విషయాన్ని వైసీపీ వారికి మోస్తున్నాడని ఆరోపణలు వస్తున్నాయి. వైసీపీ ప్రభుత్వంలో పాగా వేసిన వ్యక్తి కూటమి ప్రభుత్వంలో సైతం కీలక పోస్టు కోసం పైరవీలు చేస్తుండటం, ఉన్నతాధికారులను లెక్కలేకుండా మాట్లాడటం విమర్శలకు తావిస్తోంది. ఉపాధ్యాయ బదిలీలు, సర్దుబాట్లలో మామూళ్ల వసూళ్లపై ఇప్పటికే ఉన్నతాధికారులకు ఫిర్యాదులు వెళ్లినట్లు తెలుస్తోంది. కొత్త డీఈఓ ఆయనను కట్టడి చేస్తారా...? లేక గేట్లు ఎత్తేస్తారా అనే చర్చ జరుగుతోంది.



సమాన అవకాశాలకోసమే ఉద్యమం

మాదిగల ఆత్మీయ సదస్సులో మందకృష్ణ మాదిగ

6

నదుల అనుసంధానంతో సీమకు మేలు

ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు



అసెంబ్లీలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ కాలవ

అనంతపురం/రాయదుర్గం, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): గోదావరి, కృష్ణ, పెన్నా నదుల అనుసంధానంతో రాయలసీమకు మేలు జరుగుతుందని ప్రభుత్వ విప్, రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు అన్నారు. అసెంబ్లీ సమావేశాలలో శనివారం ఆయన మాట్లాడారు. నదుల అనుసంధానం ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించాలని కోరారు. నదుల అనుసంధానం జరిగితే రాయలసీమ, ప్రకాశం, నెల్లూరు జిల్లాలకు లాభం చేకూరుతుందని అన్నారు. సీమలో ప్రతి ఎకరానికీ సాగునీరందించాలన్న చంద్రబాబు సంకల్పం నెరవేరుతుందని అన్నారు. దీని ఖర్చును కేంద్ర ప్రభుత్వం భరించాలని కోరారు. 75 ఏళ్ల చరిత్ర కలిగిన తుంగభద్ర రిజర్వాయర్ నీటితో కలకలలాడిందని, దాదాపు 400 టీఎంసీల నీరు దిగువకు వెళ్లిందని అన్నారు. తుంగభద్ర రిజర్వాయర్ నీటి ఉధృతికి 19వ నంబరు గేటు కొట్టుకుపోయిందని, కర్ణాటక ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ నీటి ఉధృతి తగ్గేంత వరకూ గేటును అమర్చలేమని స్పష్టంగా చెప్పారని అన్నారు. అయితే మన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎంతో బాధ్యతగా స్పదించారని, ఇరిగేషన్ మంత్రి నిమ్మల రామానాయుడు, ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్‌ను గేట్ల అమరిక కోసం అప్రమత్తం చేశారని అన్నారు. అత్యంత నైపుణ్యం, అపార అనుభవం ఉన్న కన్నయ్య నాయుడు సలహాతో స్టాప్‌లాగ్‌ను అమర్చారని అన్నారు. తుంగభద్ర గేట్ల భవిష్యత్తుపై రైతుల్లో ఆందోళన నెలకొందని అన్నారు. నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ ఛైర్మన్ బజాజ్ నేతృత్వంలోని నిపుణులు డ్యాం 33 గేట్లను మార్చాలని సిఫారసు చేశారని అన్నారు. దీనికి రూ.100 కోట్లలోపు బడ్జెట్ ఉంటుందని, కర్ణాటక, ఏపీ ప్రభుత్వాలు భరించాల్సి ఉంటుందని అన్నారు. అత్యంత ప్రాధాన్యత కలిగిన ప్రాజెక్టుగా పరిగణించి 33 గేట్లను మార్చాలని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడును కోరుతున్నామని అన్నారు. శ్రీశైలం నుంచి ఒక టీఎంసీని ఎత్తిపోసి పెనుకొండ వరకూ తీసుకురావడానికి రూ.20 కోట్లు ఖర్చవుతుందని, కానీ ఒక్క రూపాయి ఖర్చు లేకుండా తుంగభద్ర నుంచి దశాబ్దాలుగా రాయలసీమకు నీటిని తీసుకొస్తున్నామని అన్నారు. హెచ్ఎల్సీ, ఎల్ఎల్సీ పెండింగ్ పనులను పూర్తి చేయాలని కోరారు. సరిహద్దు నుంచి తుంగభద్ర ఎగువ కాలువ ఆధునికీకరణ పనులకు సుమారు రూ.600 కోట్లు ఖర్చవుతుందని ప్రాథమిక అంచనా ఉందన్నారు. ఆ నిధులను వెంటనే మంజూరు చేయాలని కోరారు. వైసీపీ హయాంలో ప్రాజెక్టులను నిర్వీర్యం చేశారని విమర్శించారు. టీడీపీ హయాంలో సీమ ప్రాజెక్టులకు రూ.12,441 కోట్లు వెచ్చించామని, 2019-24 వైసీపీ ప్రభుత్వం కేవలం రూ.2011 కోట్లు ఖర్చు చేయడం సిగ్గుచేటని అన్నారు. మిగులు జలాల ఆధారిత ప్రాజెక్టులకు నీటి కేటాయింపులను కోరబోమని బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్‌కు వైఎస్ రాజశేఖర్‌రెడ్డి రాసిన లేఖ రాయలసీమ ప్రాజెక్టులకు మరణ శాసనంగా మారిందని అన్నారు. గత ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి రాయలసీమ దుర్భిక్ష నివారణ పథకం పేరుతో రూ.63 వేల కోట్లతో ప్రాజెక్టులను పూర్తి చేస్తానని నమ్మబలికి, నిధులు ఇవ్వకుండా రాయలసీమను నాశనం చేశారని అన్నారు. ఎన్డీఏ ప్రభుత్వంలోనే రాయలసీమ ప్రాజెక్టులు పూర్తవుతాయనే ఆశలు ప్రజల్లో మళ్లీ చిగురించాయని అన్నారు.

సమాన అవకాశాలకే ఉద్యమం

మూడు దశాబ్దాల పోరాటం విజయవంతం
అమరులు, నాయకులు, కార్యకర్తలకు అంకితం
మాదిగల ఆత్మీయ సదస్సులో మందకృష్ణ మాదిగ



మాదిగల ఆత్మీయ సదస్సులో మాట్లాడుతున్న మందకృష్ణ

అనంతపురం సెంట్రల్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): మూడు దశాబ్దాల ఎస్సీ వర్గీకరణ ఉద్యమంలో విజయం సాధించామని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ అన్నారు. సుప్రీం కోర్టు తీర్పు, రాష్ట్రంలో ఏక సభ్య కమిషన్ ఏర్పాటు నేపథ్యంలో నగరంలోని లలిత కళాపరిషత్‌లో మాదిగల ఆత్మీయ సదస్సును శనివారం నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు హరిగోపాల్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మందకృష్ణ మాట్లాడుతూ, ఎస్సీ ఉపకులాలన్నింటికీ సమాన అవకాశాలు దక్కాలన్న ఆకాంక్షతో వర్గీకరణ ఉద్యమం చేశామని అన్నారు. ఈ ఉద్యమంలో అనేకమంది అమరులయ్యారని, లక్షలాదిమంది నాయకులు, కార్యకర్తలు శ్రమించారని అన్నారు. పోరాటాల ఫలితంగా సుప్రీం కోర్టు ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా తీర్పు ఇచ్చిందని హర్షం వ్యక్తంచేశారు. ఎస్సీ వర్గీకరణను గతంలోనే చంద్రబాబు అమలు చేశారని, దీంతో అనేక మంది మాదిగలకు విద్య, ఉద్యోగ అవకాశాలు దక్కాయని అన్నారు. దీనికి వ్యతిరేకంగా మాలలు కోర్టుకెళ్లడంతో మళ్లీ ఉద్యమం చేపట్టాల్సి వచ్చిందని, చివరకు విజయం సాధించామని అన్నారు. ఈ విజయాన్ని మాలలు వ్యతిరేకించడం సరైందికాదని అన్నారు. దేశంలోని వివిధ రాష్ట్రాలలో ఏర్పాటైన కమిషన్లు ఎస్సీ వర్గీకరణ సరైందేనని నివేదికలు ఇచ్చాయని అన్నారు. రాష్ట్రపతులు, ప్రధానులు మాదిగల డిమాండ్ న్యాయమైదని అభిప్రాయపడ్డారని గుర్తు చేశారు.

స్వాగతిస్తున్నాం

ఎస్సీ వర్గీకరణపై రాష్ట్ర ప్రభుత్వం ఏకసభ్య కమిషన్‌ను ఏర్పాటు చేయడాన్ని స్వాగతిస్తున్నామని మందకృష్ణ మాదిగ అన్నారు. పదిరోజుల క్రితం ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నందుకు సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలు చెబుతున్నామని అన్నారు. కులం పేరు చెప్పుకోవడానికి ఒకప్పుడు సిగ్గుపడినవారు.. నేడు సగర్వంగా పేర్లకు ముందు, వెనకా మాదిగ అని పెట్టుకుంటున్నారని అన్నారు. ఇందుకు సహకరించిన న్యాయవ్యవస్థకు, ప్రధాని నరేంద్రమోదీకి, సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలని అన్నారు.

తరలివచ్చిన మాదిగలు

ఆత్మీయ సదస్సుకు వివిధ ప్రాంతాల నుంచి మాదిగలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. అంబేడ్కర్, జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు నివాళులర్పించి, లలితాకళాపరిషత్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. మందకృష్ణను గజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు విశ్వనాథ్, శంకర్, ఎల్లప్ప, గంగాధర్, అమర్నాథ్, కదిరప్ప, రమేష్, ఆంజనేయులు, నాగేంద్ర నాథ్, స్వతంత్రకుమారి, సునీత, ఉపాధ్యాయ సంఘం నాయులు పెద్దన్న, నాగభూషణం, నారాయణ, ఎస్కేయూ ఉద్యోగ సంఘం నాయకులు నారాయణ, సంజీవప్ప, దేవరాజు, లక్ష్మయ్య, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

హాజరైన మాదిగలు



న్యూస్ బాక్స్

సత్యసాయి జయంతికి వంద బస్సులు

ఆర్టీసీ ఆర్ఎం మధుసూదన్

పుట్టపర్తి టౌన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): సత్యసాయిబాబా శత జయంతిని పురస్కరించుకుని పుట్టపర్తి నుంచి వివిధ ప్రాంతాలకు వంద ఆర్టీసీ బస్సులు నడపనున్నట్లు ఆర్ఎం(రీజినల్ మేనేజర్) మధుసూదన్ తెలిపారు. ఈనెల 22నుంచి 25 వరకు ఈబస్సు సర్వీసులు నడుస్తాయన్నారు. పుట్టపర్తి రైల్వేస్టేషన్ నుంచి పట్టణంలోకి 22నుంచి 24వరకు మూడురోజులపాటూ రోజుకు పది సర్వీసులు నిరంతరం తిరుగుతాయన్నారు. అలాగే 22, 23 తేదీల్లో హిందూపురం వయా పెనుకొండ మీదుగా ఐదు బస్సు సర్వీసులు తిరుగుతాయన్నారు. హిందూపురం వయా గోరంట్ల మీదుగా 22 నుంచి 24 వరకు మూడు రోజులపాటు పది సర్వీసులు తిరుగుతాయన్నారు. 23, 24 తేదీల్లో కదిరి వయా నల్లమాడ మీదుగా పుట్టపర్తికి ప్రతిరోజు ఐదు బస్సులు తిరుగుతాయన్నారు. 22నుంచి 24 వరకు ధర్మవరం రైల్వేస్టేషన్ నుంచి పుట్టపర్తికి 12 బస్సులు తిరుగుతాయన్నారు. అనంతపురం నుంచి పుట్టపర్తికి 22 నుంచి 24వరకు మూడు ప్రత్యేక బస్సులు నడుస్తాయన్నారు. చెన్నై నుంచి కూడా పుట్టపర్తికి బస్సు సర్వీసులు ఏర్పాటు చేశామన్నారు. బెంగళూరు, విజయవాడ, తిరుపతి, హైదరాబాద్‌లనుంచి పుట్టపర్తికి 22నుంచి 24వరు ప్రత్యేక బస్సులు నడుస్తాయన్నారు. భక్తుల రద్దీని బట్టి మరిన్నిసర్వీసులు నడుపుతామన్నారు.

సివిల్స్ ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకోండి

జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ అధికారిణి నిర్మలజ్యోతి

పుట్టపర్తిరూరల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): యూపీఎస్సీ నిర్వహించే సివిల్స్ ప్రిలిమినరీ, మెయిన్స్ పరీక్షల ఉచిత శిక్షణకు జిల్లాలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ అధికారిణి నిర్మలజ్యోతి శనివారం ఓప్రకటనలో తెలిపారు. అర్హత కలిగిన అభ్యర్థులు ఈనెల 24లోపు జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ అధికారి కార్యాలయం (శ్రీసత్యసాయిజిల్లా)లో అందచేయాలని పేర్కొన్నారు. బీసీల్లో 66శాతం, ఎస్సీల్లో 20శాతం, ఎస్టీల్లో 14శాతం మందిని రిజర్వేషన్ ప్రాతిపదికన ఎంపిక చేస్తామన్నారు. ఎంపికైనవారికి గొల్లపూడిలోని బీసీ భవన్‌లో ఉచిత శిక్షణ ఇస్తారన్నారు. అభ్యర్థులు తమ బయోడేటాతో పాటు పదోతరగతి, ఇంటర్, డిగ్రీ మార్కుల జాబితా, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఆధార్, బ్యాంకు పాసు పుస్తకం, 2 పాస్‌పోర్టు సైజు ఫొటోలతో జిల్లాకేంద్రంలోని దీనజనోద్ధరణ భవన సముదాయంలోని జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి కార్యాలయం (శ్రీసత్యసాయిజిల్లా)లో దరఖాస్తులందచేయాలన్నారు. అభ్యర్థుల తల్లిదండ్రుల వార్షికాదాయం రూ. లక్షలోపు ఉండాలన్నారు. వివరాలకు నేరుగా కార్యాలయంలో కాని ఫోన్ నెంబరు 9393141545లోగానీ సంప్రదించాలని తెలిపారు.

నారా రామ్మూర్తినాయుడు మృతికి సంతాపం

అనంతపురం అర్బన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ముఖ్య మంత్రి నారా చంద్రబాబునాయుడు సోదరుడు నారా రామ్మూర్తినాయుడి మృతిపై జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు, ఎమ్మెల్యేలు పరిటాల సునీత, దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ శనివారం వేర్వేరు ప్రకటనల్లో తమ సంతాపాన్ని తెలియజేశారు. చంద్రగిరి నియోజకవర్గం, ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఆయన అందించిన సేవలు మరువలేనివన్నారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు.

ఇర్ఫాన్ సేఫ్

కొయ్యను బయటకు తీసిన వైద్యులు



బాలుడి శరీరం నుంచి బయటకు తీసిన కొయ్య

కణేకల్లు, నవంబరు 16(ఆంధ్ర జ్యోతి): రేగు చెట్టు నుంచి పడి.. నడుములోకి కొయ్య దూసుకెళ్లిన బాలుడు ఇర్ఫాన్.. సురక్షితంగా బయటపడ్డాడు. బాలుడి శరీరం నుంచి కొయ్యను కర్నూలు వైద్యులు విజయవంతంగా బయటకు తీశారు. కణేకల్లు తహసీల్దారు కార్యాలయం వద్ద రేగు చెట్టు మీద నుంచి ఇర్ఫాన్ శుక్రవారం కింద పడిన విషయం తెలిసిందే. బాలుడి నడుము భాగంలోకి కొయ్య దూసుకెళ్లడంతో కుటుంబ సభ్యులు చికిత్స కోసం అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి, అక్కడి నుంచి కర్నూలుకు తరలించారు. కర్నూలు వైద్యులు శస్త్ర చికిత్స చేసి ఇర్ఫాన్ నడుములో ఇరుక్కున్న కొయ్యను బయటకు తీశారు. బాలుడి ఆరోగ్య పరిస్థితి బాగుందని కుటుంబ సభ్యులు తెలిపారు.

తూంచెర్లలో నీట మునిగిన వరి పంట



వరిని ముంచిన వర్షం

అల్ప పీడనం కారణంగా కురిసిన వర్షాలు వరి రైతులకు తీరని నష్టాన్ని మిగిల్చాయి. కనగానపల్లి మండలంలో మూడు రోజులపాటు భారీ వర్షం కురిసింది. దీంతో కోత దశలో ఉన్న వరి పంటలు నీట మునిగాయి. తూంచెర్ల గ్రామానికి చెందిన రైతులు నాగార్జున, చిత్రా నారాయణస్వామి, జయరాములు, తిమ్మయ్య సాగు చేసిన వరి పంట కోత దశలో ఉంది. భారీ వర్షానికి పైరు మొత్తం నేలకొరిగింది. తూంచెర్లలో సుమారు వంద ఎకరాల్లో వరి పంట దెబ్బతింది. ప్రభుత్వం స్పందించి నష్ట పరిహారం ఇవ్వాలని రైతులు కోరుతున్నారు.

- ఆంధ్రజ్యోతి, కనగానపల్లి

కొత్త జీపు.. పాత జ్ఞాపకాలు



జీపు నడుపుతున్న జేసీపీఆర్

తాడిపత్రి, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ ఛైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి కొత్త జీపుపై సరదాగా విహరించారు. హైదరాబాద్ నుంచి తెచ్చిన అధునాతన జీపును శనివారం ఆయన సరదాగా నడిపారు. ఇంటి చుట్టూ, మైదానంలో విహరిస్తూ.. పాతజ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. జేసీ ప్రభాకర్ విహారాన్ని ఆయన అనుచరవర్గం ఆనందంగా వీక్షించింది.

దర్జాగా...

- సరిహద్దు దాటుతున్న చౌక బియ్యం
- కర్ణాటకకు తరలుతున్న వందల క్వింటాళ్లు



ఇటీవల కుందుర్పి మండలంలో ఆటోల్లో తరలిస్తున్న బియ్యాన్ని పట్టుకున్న పోలీసులు (ఫైల్)

కళ్యాణదుర్గం, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గం మీదుగా ప్రతిరోజు వందల క్వింటాళ్ల చౌకధరల ధాన్యపు డిపో బియ్యాన్ని సరిహద్దులు దాటించేస్తున్నారు. ఈ బియ్యానికి కర్ణాటక రాష్ట్రంలో మంచి ధర, డిమాండ్ ఉండటంతో అక్రమ రవాణా ఎక్కువగా సాగుతోంది. జిల్లా సరిహద్దు ప్రాంతాలైన కంబదూరు, కుందుర్పి, శెట్టూరు, కళ్యాణదుర్గం ప్రాంతాల్లో యథేచ్ఛగా బియ్యం అక్రమ రవాణా సాగుతోంది. అక్రమార్కులు తొలుత ఇక్కడ కిలో రూ. 10లకు బియ్యం సేకరించి నిల్వ చేస్తారు. తర్వాత రాత్రికి రాత్రే ఆ నిల్వలను సరిహద్దులు దాటిస్తున్నారు. కర్ణాటకలో కిలో రూ. 20లు నుంచి రూ.25ల వరకు విక్రయిస్తున్నారు. దీనికితోడు వాటిని అక్కడే పాలిష్ చేయించి కిలో రూ. 30 నుంచి రూ. 40 లు వరకు అమ్ముతున్నారు. రేషన్ బియ్యం అక్రమ రవాణా లాభసాటిగా ఉండటంతో పలువురు అక్రమార్కులు విచ్చలవిడిగా దీన్ని కొనసాగిస్తున్నారు. అప్పుడప్పుడు విజిలెన్స్, పోలీసుల దాడుల్లో పట్టుబడుతున్నా ఈ బియ్యం అక్రమ రవాణా మాత్రం ఆగడం లేదు.

అక్రమ రవాణా సాగుతోందిలా..

ఉరవకొండ నుంచి కళ్యాణదుర్గం మీదుగా కంబదూరును దాటుకుని కర్ణాటక సరిహద్దు ప్రాంతంలోకి యథేచ్ఛగా అక్రమ బియ్యాన్ని తరలిస్తున్నారు. ఎక్కువగా ఉరవకొండ, కళ్యాణదుర్గం ప్రాంతాల నుంచే రేషన్ బియ్యాన్ని తరలిస్తున్నట్లు తెలుస్తోంది. బొలెరో, ఆటోల్లో ఈ రవాణా సాగుతోంది. తెల్లవారుజాము సమయాల్లోనే ఈ అక్రమ రవాణా సాగుతున్నట్లు సమాచారం. కర్ణాటకకు వెళ్లే మార్గంలో కళ్యాణదుర్గం, కంబదూరు పోలీస్‌స్టేషన్లు ఉన్నప్పటికీ అక్రమార్కులు భయపడటం లేదు. పోలీసుల కళ్లుగప్పి సరిహద్దు దాటించేస్తున్నారు. పోలీసులు దాడులు చేసి పట్టుకున్నా వారిలో ఏ మాత్రం భయం కలగడం లేదు. కంబదూరు, కుందుర్పి, శెట్టూరు మండలాలు కర్ణాటక సరిహద్దు ప్రాంతానికి కేవలం మూడు కిలోమీటర్ల పరిధిలోనే ఉన్నాయి. దీంతో ఎక్కువగా అక్రమ రవాణా సాగుతోంది. కళ్యాణదుర్గం మండలం మోరేపల్లి, కొత్తూరు అటవీశాఖ దారి వెంబడి వెళ్లి, అక్కడి నుంచి కుందుర్పి మండలం బెస్తరపల్లికి వెళ్లి కర్ణాటక సరిహద్దు ప్రాంతంలోకి ప్రవేశిస్తున్నట్లు సమాచారం. ఈ తతంగం గత కొన్నేళ్ల నుంచి సాగుతున్నా అధికారులు అరికట్టలేకపోతున్నారు.

ప్రత్యేక నిఘా వేశాం



స్టోర్ బియ్యం అక్రమ రవాణాపై మా సిబ్బందితో పూర్తి స్థాయిలో నిఘా వేశాం. కళ్యాణదుర్గం రూరల్, కళ్యాణదుర్గం టౌన్ పరిధిలో ఉన్న పోలీసులు కూడా వీటిపైనే ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. దాంతో పాటు కర్ణాటక సరిహద్దు మండలాల్లో ఉన్న పోలీస్‌స్టేషన్లను కూడా అప్రమత్తం చేశాం.

- రవిబాబు, డీఎస్పీ, కళ్యాణదుర్గం

కూలిన పెన్నా వంతెన

రాకపోకలకు ఇబ్బందులు





ఒక వైపు నుంచి ప్రమాదకరంగా వెళ్తున్న వాహనాలు

మట్టిరోడ్డును ధ్వంసం చేసిన దృశ్యం

హిందూపురం అర్బన్, నవంబరు 16: (ఆంధ్రజ్యోతి): హిందూపురం-పోచనపల్లి మధ్య పెన్నానది వంతెన శనివారం తెల్లవారుజామున కూలిపోయింది. పురాతన వంతెన కావడంతో కాలం చెల్లింది. భారీ వాహనాలు వంతెనపై ప్రయాణించడంతో కూలిపోయిందని స్థానికులు చెబుతున్నారు. ఇటీవల ఇసుక ట్రాక్టర్‌లు, టిప్పర్‌లు, బియ్యం వాహనాలు, కంకర టిప్పర్‌లు ఈ వంతెన మీదుగా వెళుతున్నాయి. కర్ణాటకకు అక్రమ రవాణా ఈ మార్గంలోనే సాగుతోంది. 2022లో కురిసిన భారీ వర్షాలకు పెన్నానది వంతెన కూలిపోయింది. దీంతో అటువైపు ఉన్న దాదాపు పది గ్రామాలకు, కర్ణాటకకు రాకపోకలు నిలిచిపోయాయి. తప్పనిసరి అనుకుంటే 25 కి.మీ. చుట్టేసుకుని సేవామందిరం మీదుగా ప్రయాణించాల్సి వచ్చింది. దీంతో ఆర్అండ్‌బీ అధికారులు రూ.10 లక్షలతో తాత్కాలికంగా ఐరన్ వంతెనను నిర్మించారు. ఇది పాదచారులకు మాత్రమే ఉపయోగపడేది. అంబులెన్స్ వంటివి రాలేకపోయాయి. ఆ తరువాత రూ.80 లక్షలతో 10 మీటర్లు వరకు వంతెనను పునర్నిర్మించారు. ఇంతలోనే పోచనపల్లి వైపు ఉన్న వంతెన కూలిపోయింది. ప్రస్తుతం వంతెనపై ట్రాక్టర్ పట్టేంత మార్గం మాత్రమే ఉంది. అది కూడా ఎప్పుడు కూలుతుందోనని జనం భయపడుతున్నారు. కూలిన వంతెన కింద భాగంలో భారీగా తెర్ర పడింది. భారీ వాహనాలు వస్తే అదికూడా కూలిపోయేలా ఉంది. దీంతో పోచనపల్లి యువకులు ఆ ప్రాంతంలో ముళ్ల కంచె ఏర్పాటు చేశారు. మరోవైపు పెన్నాలో మట్టిరోడ్డును కొందరు ధ్వంసం చేశారు. దీంతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది.

ప్రతిపాదనలు పంపాము..

పెన్నా నదితో వంతెన కూలింది. వంతెన పునర్నిర్మాణానికి ఇప్పటికే ప్రభుత్వానికి రూ.3 కోట్లతో ప్రతిపాదనలు పంపాము. ప్రభుత్వం నుంచి నిధులు రాగానే టెండర్ పిలుస్తాము. పనులను త్వరగా చేపట్టేందుకు ప్రయత్నిస్తాం. తాజా పరిస్థితిని ఉన్నతాధికారులకు తెలియజేశాము.

- మోహన్‌బాబు, ఏఈ ఆర్ అండ్ బీ

క్షుద్రం.. వజ్రం..!

నిత్యం వివాదాలు.. మోసాలు
వజ్ర భాస్కర్ రెడ్డి తీరుపై విమర్శలు



వైసీపీ అధినేత వైఎస్ జగన్‌తో వజ్ర భాస్కర్‌రెడ్డి (ఫైల్)

కదిరి, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకుడు వజ్ర భాస్కర్ రెడ్డి క్షుద్రపూజలు చేస్తూ పోలీసులకు పట్టుబడటం జిల్లాలో కలకలం రేపుతోంది. అన్నమయ్య జిల్లా బి.కొత్తకోట అటవీ ప్రాంతంలోని ఓ పురాతన ఆలయంలో క్షుద్రపూజలు చేస్తుండగా ఆయనను పోలీసులు అరెస్టు చేశారు. వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఉన్న వజ్రభాస్కర్ రెడ్డి పలు పార్టీలను మారారు. నమ్ముకున్న కార్యకర్తలను నట్టేట ముంచడం ఆయనకు అలవాటని స్థానికులు విమర్శిస్తున్నారు. వజ్ర భాస్కర్‌రెడ్డి 2019లో కదిరి వైసీపీ టిక్కెట్ ఆశించారు. దక్కకపోవడంతో మరో పార్టీనుంచి పోటీ చేశారు. ఆ తరువాత బీజేపీలో చేరారు. 2024 ఎన్నికలకు ముందు తిరిగి వైసీపీలో చేరారు. బీజేపీలో ఉండగా మహిళా కార్యకర్తలకు స్థలం ఇస్తానని నమ్మించారు. ఇవ్వకుండా మోసగించారు. దీంతో బాధిత మహిళలు ఆయన కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. రియల్ వ్యాపారం చేసే వజ్ర భాస్కర్ రెడ్డి.. కొత్త బైపాస్ రోడ్డుకు సమీపంలో ప్లాట్లు వేశారు. తనకు చెందిన రెండు సర్వే నంబర్ల మధ్యలో ఉన్న 33 సెంట్ల ప్రభుత్వ భూమిని కలుపుకున్నారు. ప్రభుత్వ భూమిలో రోడ్లు వేసి, తన భూమిలో ప్లాట్లు వేసుకున్నారు. ప్రభుత్వ భూమి విలువ ఒకటిన్నర కోటి ఉంటుంది.

అందరూ అంతేనా..!

రియల్ మోసాలు, ప్రభుత్వ భూముల కబ్జా, ప్రజలను మోసం చేయడం వంటి అనేక కేసుల్లో కదిరికి చెందిన పలువురు వైసీపీ నాయకులు నిందితులుగా ఉన్నారు. తలుపుల ఉప సర్పంచ్ డి. క్రిష్టారెడ్డి, అలియాస్ డిక్కీ బాబు ఓ టీచర్‌ను మోసగించి జైలుపాలయ్యారు. వివిధ ప్రాంతాల్లో రైస్ పుల్లింగ్ పేరిట మోసాలు చేశారనే ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. తాజాగా ఇదే మండలానికి చెందిన వజ్రభాస్కర్ రెడ్డి క్షుద్ర పూజలు చేస్తూ పట్టుబడ్డారు.

బ్రేక్..!

ప్రైవేటు ఏజెన్సీలో ఫిట్‌నెస్ పరీక్షలు తాత్కాలికంగా నిలిపివేత

ఆర్థిక శాఖ అనుమతులు లేకపోవడమే కారణం
వైసీపీ సర్కార్‌లో టెండర్లు ఖరారు
పారదర్శకతపై సర్వత్రా అనుమానాలు..



శివశంకర్ ఎంటర్‌ప్రైజెస్ ఆటోమెటెడ్ ఫిట్‌నెస్ టెస్టింగ్ కేంద్రం

అనంతపురం అర్బన్ నవంబరు 16(ఆంధ్రజ్యోతి): అనంతలో ప్రైవేటు ఏజెన్సీలో వాహనాల ఫిట్‌నెట్ పరీక్షలకు తాత్కాలిక బ్రేక్ పడింది. ఆర్థిక శాఖ అనుమతులు లేకపోవడంతోనే నిలుపుదల చేసినట్లు సమాచారం. వైసీపీ సర్కార్ హయాంలో రాష్ట్ర వ్యాప్తంగా వాహనాల ఫిట్ నెట్ పరీక్షల నిర్వహణ కోసం టెండర్లు ఖరారు చేశారు. అయితే సార్వత్రిక ఎన్నికల సమయంలో టెండర్లు దక్కించుకున్న సంస్థలకు బాధ్యతలు అప్పగించలేదు. ఎన్నికల తర్వాత ఈ ఏడాది సెప్టెంబరు ఆరంభం నుంచి జిల్లాలో శివశంకర్ ఎంటర్‌ప్రైజెస్‌కు ఆటోమెటెడ్ ఫిట్‌నెస్ మేనేజ్‌మెంట్ సిస్టం(ఏఎఫ్ఎంఎస్) నిర్వహణ బాధ్యతలు అప్పగించారు. జాతీయరహదారిలోని హైదరాబాద్ చెఫ్స్ ఎదురుగా రాప్తాడు మండలం ప్రసన్నాయపల్లి పరిధిలో అయ్యవారిపల్లికి వెళ్లే దారిలో ఫిట్ నెస్ పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి ప్రైవేటు కేంద్రంలోనే వాహనాల ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహిస్తూ వస్తున్నారు.

పారదర్శకతపై అనుమానాలు

వైసీపీ హయాంలో వాహనాల ఫిట్‌నెట్ పరీక్షల నిర్వహణ బాధ్యతలను ప్రైవేటు సంస్థలకు అప్పగించేందుకు టెండర్లు ఖరారు చేశారు. అయితే ఇది పారదర్శకంగా జరిగిందో లేదోనన్న సందేహాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. పదేళ్ల వరకు నిర్వహణ కోసం టెండర్లు ఖరారు చేసినట్లు సమాచారం. అయితే కూటమి ప్రభుత్వం ఈ విధానంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు సమాచారం. రాష్ట్ర వ్యాప్తంగా అనంత జిల్లాతోపాటు మరో రెండు జిల్లాల్లో మాత్రమే ఇప్పటి దాకా ప్రైవేటు సంస్థల ఆధ్వర్యంలో ఫిట్‌నెస్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. మిగిలిన జిల్లాల్లో ఇంకా ఏర్పాటు చేయలేదు. ప్రస్తుతం ఓపెన్‌లోని కేంద్రాల్లో ఫిట్‌నెస్ పరీక్షల నిర్వహణపైనా ప్రభుత్వం దృష్టి సారించాలన్న యోచనలో ఉన్నట్లు తెలిసింది. ఆర్థిక శాఖ అనుమతులు లేవన్న కారణంతోనే ప్రైవేటు సంస్థల్లో నిర్వహిస్తున్న వాహనాల ఫిట్‌నెస్‌ను తాత్కాలికంగా నిలుపుదల చేసినట్లు తెలిసింది.

అప్పటి దాకా ఆర్టీఏ ఆఫీస్‌ల్లోనే పరీక్షలు

జిల్లా కేంద్రం సమీపంలోని ప్రైవేటు ఏజెన్సీలో ఫిట్‌నెస్ పరీక్షలను తాత్కాలికంగా నిలుపుదల చేసిన నేపథ్యంలో పాత పద్ధతిలో అనంతపురం, తాడిపత్రి, గుంతకల్లు, రాయదుర్గం ఆర్టీఏ కార్యాలయ పరిధిల్లోని అన్ని రకాల వాహనాలకు ఫిట్ నెస్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. ప్రైవేటు ఏజెన్సీకి ఫిట్‌నెస్ పరీక్షల బాధ్యత అప్పగించినప్పటి నుంచి జిల్లాలోని అన్ని ప్రాంతాల వాహనాలు తప్పని సరిగా జిల్లా కేంద్రం సమీపంలోని శివశంకర్ ఎంటర్‌ప్రైజెస్ ఏజెన్సీ కేంద్రానికి వచ్చేవి. గత వారం రోజులుగా అక్కడ ఫిట్‌నెస్ పరీక్షలు బంద్ చేయడంతో తిరిగి ఆర్టీఏ కార్యాలయాల్లోనే ఫిట్‌నెస్ పరీక్షలు చేస్తున్నారు. ప్రభుత్వం నుంచి తదుపరి నిర్ణయం వచ్చే దాకా ఆర్టీఏ కార్యాలయాల్లోనే వాహనాల ఫిట్‌నెస్ పరీక్షలు కొనసాగుతాయి.



అనంత ఆర్టీఏ కార్యాలయంలో ఫిట్‌నెస్ పరీక్షల కోసం నిలిపిన వాహనాలు

తాత్కాలికంగా బంద్: వీర్రాజు, జిల్లా ట్రాన్స్‌పోర్టు అధికారి

పలు కారణాల నేపథ్యంలో ప్రైవేటు ఏజెన్సీలో ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహణను ప్రభుత్వం తాత్కాలికంగా నిలుపుదల చేసింది. ప్రభుత్వం నుంచి తదుపరి ఆదేశాలు వచ్చే దాకా ఆర్టీఏ కార్యాలయాల్లోనే యథాతథంగా వాహనాల ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహిస్తాం. అప్పటి దాకా ప్రైవేటు ఏజెన్సీకి బదులుగా పాత పద్ధతిలో వాహన్ సైట్‌లో ఫిట్‌నెస్ పరీక్షల కోసం చలానాలు కట్టాలి. ఈ విషయాన్ని వాహనదారులు గమనించాలి.

క్రైం కార్నర్

బీటెక్ విద్యార్థి ఆత్మహత్య


మృతి చెందిన యోగేంద్రరెడ్డి

అనంతపురం క్రైం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగం రాలేదనే మనస్తాపంతో ఇంజనీరింగ్ చదివిన ఓ విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అనంతపురం రూరల్ పోలీసులు తెలిపిన మేరకు... గార్లదిన్నె మండలం మర్తాడుకు చెందిన తాతిరెడ్డి యోగేంద్ర రెడ్డి(28) ఇంజనీరింగ్ చదివాడు. మూడు సంవత్సరాలుగా ఉద్యోగం కోసం ప్రయత్నించాడు. ఉద్యోగం ఇకరాదని మనస్తాపానికి గురైన యోగేంద్రరెడ్డి శనివారం సోముల దొడ్డి రైల్వేలైన్ నుంచి తాటిచెర్ల రైల్వేలైన్ మధ్యలో ట్రాక్ పక్కనున్న చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. తాతిరెడ్డి దంపతులకు కొడుకు, కుమార్తె సంతానం. ఒక్కగానొక్క కొడుకు ఆత్మహత్య చేసుకోవడంతో వారు కన్నీరుమున్నీరయ్యారు. అనంతపురం రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకుడి మృతి

బత్తలపల్లి, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వాహనం ఢీకొని మండల కేంద్రమైన బత్తలపల్లిలో ఓ యువకుడు మృతి చెందాడు. ఎస్ఐ సోమశేఖర్ తెలిపిన మేరకు.. బత్తలపల్లి-అనంతపురం రహదారిలో గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అనిల్‌కుమార్ (32) అనే యువకుడు మృతి చెందాడు. ఆదోనికి చెందిన నిత్యానంద్ కుమారుడు అనిల్‌కుమార్ పది రోజుల నుంచి కనిపించలేదు. శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. శనివారం వాహనదారులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ సంఘటనా స్థలాన్ని పరిశీలించి మృతుడి చేతుల మీద ఉన్న పచ్చబొట్టు ఆధారంగా సామాజిక మాధ్యమాల్లో ఫొటోలను పంపించారు. విషయం తెలుసుకుని కుటుంబ సభ్యులు వచ్చి మృతదేహాన్ని గుర్తించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

న్యూస్ బాక్స్

మార్కెట్‌కు మరింత తగ్గిన టమోటాల రాక

అనంతపురం రూరల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి టమోటా మార్కెట్‌కు వారంరోజులుగా టమోటా ఉత్పత్తులు రావడం తగ్గుతూ వస్తోంది. శనివారం భారీగా తగ్గాయి. 450 టన్నులు మాత్రమే వచ్చాయి. అయితే ధరల్లో మాత్రం ఎలాంటి వ్యత్యాసం కనిపించడం లేదు. కిలో టమోటా గరిష్ఠంగా రూ. 23తో అమ్ముడుపోగా, సరాసరి ధర రూ.18, కనిష్ఠ ధర రూ.13 పలికినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు.

చీనీ టన్ను రూ.29 వేలు

అనంతపురం రూరల్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో శనివారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ. 29,300 పలికినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి గోవిందు తెలిపారు. కనిష్ఠంగా రూ. 15,300, సరాసరి రూ. 20వేలతో అమ్ముడు పోయినట్లు ఆయన తెలిపారు. మార్కెట్‌కు మొత్తంగా 34 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

1.578 టీఎంసీల నీటి నిల్వ

బెళుగుప్ప, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌లో ప్రస్తుతం 1.578 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు హంద్రీనీవా అధికారులు శనివారం తెలిపారు. అలాగే ఇన్‌ఫ్లో 1104 క్యూసెక్కులు ఉండగా.. ఔట్‌ఫ్లో కింద హెచ్ఎన్ఎస్ఎస్-2కు 983 క్యూసెక్కులు వెళుతున్నట్లు పేర్కొన్నారు.

రేపు రాష్ట్రస్థాయి కనకదాస జయంత్యుత్సవం

అనంతపురం ప్రెస్‌క్లబ్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : బీసీ సంక్షేమశాఖ రాష్ట్ర శాఖ డైరెక్టర్ ఆదేశాల మేరకు సోమవారం జిల్లాలో రాష్ట్రస్థాయి కనకదాస జయంతి వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఆ శాఖ డీడీ కుష్బూకొఠారీ తెలిపారు. ఈ మేరకు శనివారం విడుదల చేసిన ప్రకటనలో ఆమె స్పష్టం చేశారు. సోమవారం ఉదయం 10 గంటలకు నగరంలోని గుత్తిరోడ్డులో ఉన్న కనకదాస విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పిస్తారని తెలిపారు. అనంతరం కేటీఆర్ కన్వెన్షన్ హాల్‌లో ఉత్సవాలు నిర్వహిస్తామన్నారు. వేడుకలకు జిల్లాలోని ప్రజలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

22 మండలాల్లో వర్షం



అనంతపురం అర్బన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 22 మండలాల్లో శుక్రవారం వర్షం కురిసింది. అత్యధికంగా ఆత్మకూరు 30.0 మి.మీ వర్షపాతం నమోదైంది. బ్రహ్మసముద్రం 11.2, రాప్తాడు 11.0, గుంతకల్లు 10.2, కంబదూరు 9.8, కణేకల్లు 9.6, యల్లనూరు 8.6, రాయదుర్గం, బుక్కరాయసముద్రం 7.2, శెట్టూరు 6.8, పెద్దపప్పూరు, బెలుగుప్ప 6.2 మి.మీ నమోదైంది. మిగతా మండలాల్లో 5.4 మి.మీలోపు వర్షపాతం నమోదైంది.

కుడి.. ఎడం..!



- పీఏబీఆర్ కుడి కాలువలో పారని నీరు
- నీరు లేక వెలవెలబోతున్న చెరువులు
- వేసవిలో కష్టమవుతుందంటున్న రైతులు


నీరు లేక ఎండిపోయిన బొమ్మేపర్తి చెరువు

రాప్తాడు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): పీఏబీఆర్ కుడి కాలువ నీటి కోసం పలు గ్రామాల రైతులు ఎదురుచూస్తున్నారు. నీరు లేక ఆయా గ్రామాల చెరువులు వెలవెల బోతున్నాయి. ఏటా నవంబరులో పీఏబీఆర్ కుడి కాలువకు నీరు విడుదల చేసేవారు. వచ్చే నీటితో కాలువ పరిధిలోని చెరువులను నింపేవారు. అయితే ఈ ఏడాది అధికారులు కుడి కాలువకు నీరు విడుదల చేయకపోవడంతో దాని పరిధిలోని గ్రామాల రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది చెరువులకు నీరు సరఫరా కాకపోతే వేసవిలో తాగు, సాగు నీటి బోర్లలో భూగర్భ జలాలు అడుగంటుతాయని


గొందిరెడ్డిపల్లి చెరువులో అడుగంటిన నీరు

ఆందోళన చెందుతున్నారు. పీఏబీఆర్ కుడి కాలువ ద్వారా 49 చెరువుకు నీరు చేరుతుంది. రాప్తాడు మండలంలో బొమ్మేపర్తి, యర్రగుంట, గొందిరెడ్డిపల్లి, లింగనపల్లి, ఎం. చెర్లోపల్లి, మరూరు, గొల్లపల్లి, హంపాపురం -1, హంపాపురం-2, చెరువులకు పీఏబీఆర్ నుంచి నీరు సరఫరా అవుతుంది.

వర్షానికి నిండిన కొన్ని చెరువులు

ఇటీవల కురిసిన భారీ వర్షానికి మండలంలోని కొన్ని చెరువులు నీటితో నిండాయి. బుక్కచెర్ల చెరువుకు హంద్రీనీవా నీరు సరఫరా అవడంతో పాటూ వర్షపు నీరు తోడవ్వడంతో మరువ పారింది. యర్రగుంట, పుల్లలరేవు చెరువులు భారీ వర్షానికి నిండిపోయాయి. మిగతా చెరువుల్లో నీరు లేక రైతుల ఎదురుచూస్తే పరిస్థితి నెలకొంది. మండలంలోని గొందిరెడ్డిపల్లి చెరువు నిండి మరువ పారితే ఆ నీరు బొమ్మేపర్తి, లింగనపల్లి చెరువులకు సరఫరా అవుతాయి. అయితే గొందిరెడ్డిపల్లి చెరువులో గుంతల్లో మాత్రమే నీరు ఉంది. బొమ్మేపర్తి, లింగనపల్లి చెరువుల్లో చుక్క నీరు కూడా లేదు. అలాగే హంపాపురం-1, హంపాపురం-2 చెరువులు, గొల్లపల్లి చెరువులు నీరు లేక ఎండిపోయాయి. ఎం. చెర్లోపల్లి, మరూరు చెరువుల్లో 50 శాతం వర్షపు నీరు ఉంది. పీఏబీఆర్ కుడి కాలువ ద్వారా చెరువుకు నీరు సరఫరా కాకపోతే బోరుబావుల్లో నీటిమట్టం తగ్గే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి పీఏబీఆర్ కుడి కాలువకు నీరు విడుదల చేసి పూర్తి స్థాయిలో చెరువులు నింపాలని రైతులు కోరుతున్నారు.

బోర్లలో నీరు తగ్గుతాయి



ప్రస్తుతం బొమ్మేపర్తి చెరువులో చుక్క నీరు కూడా లేదు. గొందిరెడ్డిపల్లి చెరువు మరువ పారితేనే మా ఊరి చెరువుకు నీరు సరఫరా అవుతాయి. మా ఊరి చెరువు నిండిన తరువాతే లింగనపల్లి చెరువుకు నీరు సరఫరా అవుతాయి. కుడి కాలువ నీరు సరఫరా కాకపోతే వేసవితో బోర్లలో నీరు తగ్గుతాయి.

- లింగప్ప రైతు బొమ్మేపర్తి

చెరువులు నింపాలి



గొందిరెడ్డిపల్లి చెరువులో గుంతల్లో మాత్రమే నీరు ఉన్నాయి. రబీ సీజన్ ప్రారంభం కావడంతో చెరువులో నీరు త్వరగా ఇంకిపోయే అవకాశం ఉంది. కుడి కాలువకు నీరు విడుదల చేసి, చెరువులు పూర్తి స్థాయిలో నీటితో నింపితే మరో ఏడాది కాలం తాగు, సాగు నీటికి కొరత ఉండదు.

- ఉజ్జన్న రైతు గొందిరెడ్డిపల్లి

వైసీపీ నాయకుడిని విచారించిన పోలీసులు

హిందూపురం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): వైసీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు వాల్మీకి లోకేష్‌ను పోలీసులు పిలిపించి విచారించారు. వన్‌టౌన్ పోలీసులు శనివారం సాయంత్రం స్టేషన్‌కు తీసుకొచ్చి అతడి సెల్‌ఫోన్‌లో సోషల్‌మీడియాను పరిశీలించారు. గత వైసీపీ హయాంలో ఇతను టీడీపీకి వ్యతిరేకంగా సోషల్ మీడియాలో కొన్ని పోస్టులు చేసినట్లు పోలీసులకు సమాచారం రావడంతో అతన్ని స్టేషన్‌కు రప్పించి విచారణ చేశారు. అయితే జూన్ 4 తరువాత ఎలాంటి పోస్టులు చేయకపోవడంతో వదిలేశారు. అతడితోపాటు అతడి అనుచరులెవరైనా పోస్ట్ చేసినా అతడిదే బాధ్యత అని హెచ్చరించి వదిలేసినట్లు సీఐ రాజగోపాల్‌నాయుడు తెలిపారు.

బీజేపీ కార్యకర్తపై హత్యాయత్నం

- పరిస్థితి విషమం

బొమ్మనహాళ్, నవంబర్ 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చంద్రగిరి గ్రామంలో శనివారం రాత్రి బీజేపీ కార్యకర్త కృష్ణమూర్తిశెట్టి (55)పై హత్యాయత్నం జరిగింది. వేట కొడవలితో కృష్ణమూర్తిశెట్టి చెయ్యి, వీపు, తలపై నరికారు. ఇంట్లో ఉన్న బాధితుడి చెల్లెలు పుష్పావతి బయటకు వచ్చి కేకలు వేయడంతో దాడికి పాల్పడిన వ్యక్తి పరారయ్యాడు. కొన ఊపిరితో ఉన్న కృష్ణమూర్తిని బళ్లారి విమ్స్‌కు తరలించారు. ఆయన పరిస్థితి విషమంగా ఉంది. బొమ్మనహాళ్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని విచారించారు. గ్రామస్థులు తెలిపిన మేరకు కృష్ణమూర్తిశెట్టి ఆయన చెల్లెలు పుష్పావతి (ఇద్దరూ అవివాహితులే) గ్రామంలో నివసిస్తున్నారు. రాత్రి కృష్ణమూర్తిశెట్టి భోజనం తింటుండగా ఆకస్మాత్తుగా అతడిని వేట కొడవలితో నరికినట్లు తెలిపారు. అతడి చెల్లెలు కేకలు విని తాము అక్కడికి వచ్చినట్లు పేర్కొన్నారు. కృష్ణమూర్తిశెట్టికి కురువళ్లి గ్రామానికి చెందిన ఓ వ్యక్తితో భూ తగాదా ఉందని, ఆ నేపథ్యంలోనే ఈ ఘటన జరిగి ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. త్వరలోనే దాడికి సంబంధించిన పూర్తి వివరాలను వెల్లడిస్తామని రాయదుర్గం రూరల్ సీఐ వెంకటరమణ తెలిపారు.

22 నుంచి రాష్ట్రస్థాయి అంధుల అథ్లెటిక్స్ పోటీలు

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): అంధుల రాష్ట్రస్థాయి అథ్లెటిక్ పోటీలు 22, 23వ తేదీల్లో అనంత క్రీడాగ్రామం ఆర్డీటీ స్టేడియంలో నిర్వహించనున్నట్లు ఏపీ అంధుల క్రీడా సంఘం కార్యదర్శి రఘుకుమార్ తెలిపారు. పోటీలలో పురుషులకు 100మీటర్ల నుంచి 5వేల మీటర్ల పరుగు పోటీలు, షాట్‌పుట్, డిస్కస్‌త్రో, జావెలిన్‌త్రో, లాంగ్‌జంప్ పోటీలు ఉంటాయన్నారు. మహిళలకు 100మీటర్ల నుంచి 1500మీటర్ల వరకు పరుగు పోటీలు, షాట్‌పుట్, డిస్కస్‌త్రో, జావెలిన్‌త్రో, లాంగ్‌జంప్ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పోటీలలో విజేతలు డిసెంబరు 13వ తేదీ నుంచి గుజరాత్‌లో ఇండియన్ బ్లైండ్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే జాతీయస్థాయి పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. మరిన్ని వివరాలకు 9000878080, 9391045655 నంబర్లను సంప్రదించాలని కోరారు.

జర్మనీలో నర్సింగ్ ఉద్యోగావకాశాలు

అనంతపురం సెంట్రల్, నవంబరు11 (ఆంధ్రజ్యోతి) : జర్మనీలో నర్సింగ్ ఉద్యోగాలకు ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఓఎంసీఏపీ, ఎస్ఎం కేర్ సంయుక్తాధ్వర్యంలో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు శనివారం డిస్ట్రిక్ట్ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఆఫీసర్ ప్రతాపరెడ్డి తెలిపారు. జీఎన్ఎం, బీఎస్సీ నర్సింగ్ పూర్తిచేసిన విద్యార్థులు అర్హులన్నారు. జీఎన్ఎం విద్యార్థులు రెండు, బీఎస్సీ నర్సింగ్ విద్యార్థులు మూడు సంవత్సరాలు అనుభవం ఉండాలని తెలిపారు. ఈనెల 27వరకు రిజిస్ట్రేషన్ గడవు ఉంటుందని, డిసెంబరు 1 నుంచి ఆరునెలల పాటు శిక్షణా తరగతులు నిర్వహిస్తారని తెలిపారు. శిక్షణా కాషన్ డిపాజిట్ రూ.75వేలు చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఉద్యోగాలకు ఎంపికైన వారికి రూ.2.33 లక్షల నుంచి రూ.3.26లక్షల వరకు నెల జీతం ఉంటుందని తెలిపారు. ఎంపికైన అభ్యర్థుల వీసా ఫీజు, రానుపోను విమాన టికెట్లు ఎస్ఎం కేర్ సొల్యూషన్స్ చెల్లిస్తుందన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు https://forms.gle/4ZFuigtBSwXPUMgY8,skillinternational@apssdc.in మెయిల్‌కు రెస్యూమ్‌ను పంపాలని సూచించారు. వివరాలకు 9988853335 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

గాయపడ్డ ఇంజనీరింగ్ విద్యార్థి మృతి

- మృతదేహంతో విద్యార్థి సంఘాలు, బంధువులు నిరసన
- కళాశాల గుర్తింపు రద్దు చేయాలని డిమాండ్

హిందూపురం, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): సహ విద్యార్థుల దాడిలో గాయపడిన విద్యార్థి ప్రేమ్‌సాయి మృతి చెందాడు. దీంతో బాధ్యులను కఠినంగా శిక్షించి, కళాశాల గుర్తింపు రద్దు చేయాలని విద్యార్థి సంఘాల నాయకులు, మృతుడి బంధువులు డిమాండ్ చేశారు. హిందూపురంలోని బెంగళూరు రోడ్డులో నివాసమున్న శ్రీనివాసులు కుమారుడు ప్రేమ్‌సాయి(19) పుట్టపర్తిలోని ప్రైవేట్ కళాశాలలో ఇంజనీరింగ్ రెండో సంవత్సరం చదువుతూ అక్కడే హాస్టల్‌లో ఉండేవాడు. ఈ నెల 13న అదే కళాశాలలో కొంతమంది విద్యార్థులు అతడిపై దాడి చేసి, గాయపరిచారు. నొప్పి తట్టుకోలేక ప్రేమ్‌సాయి అదేరోజు సాయంత్రం ఇంటికి వచ్చేశాడు. మరుసటి రోజు చెవి నొప్పి అధికం కావడంతో తల్లిదండ్రులు అతడిని ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించారు. అయితే కడుపునొప్పి, చెవినొప్పి అధికం కావడంతో ఈనెల 15న ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. దీంతో ఆగ్రహించిన కుటుంబ సభ్యులు పోస్టుమార్టం నిర్వహించవద్దని అడ్డుకున్నారు. అయితే పోలీసులు వారికి నచ్చజెప్పి పోస్టుమార్టం పూర్తి చేయించారు. కానీ మృతదేహాన్ని పుట్టపర్తిలోని కళాశాల వద్దకు తీసుకెళ్లి ధర్నా చేయడానికి కుటుంబసభ్యులు, ఎస్ఎఫ్ఐ నాయకులు ప్రయత్నించారు. టూటౌన్ సీఐ కరీం, వన్‌టౌన్ ఎస్ఐ శ్రీధర్ వారిని అడ్డుకున్నారు. దీంతో ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలోనే వారు మృతదేహంతో నిరసన తెలిపారు. విద్యార్థి బంధువులు మాట్లాడుతూ ప్రేమ్‌సాయిపై కొంతమంది విద్యార్థులు దాడి చేసి చంపేశారని, అయినా కళాశాల యాజమాన్యం పట్టించుకోకపోవడం దుర్మార్గమన్నారు. దాడిలో తీవ్రంగా గాయపడిన విషయాన్ని కూడా తల్లిదండ్రులకు చెప్పకుండా ఇంటికి పంపడం కళాశాల నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. ప్రేమ్‌సాయి మృతికి కారకులైన విద్యార్థులను శిక్షించాలని పోలీసులను కోరారు. కళాశాలపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.


మృతదేహంతో నిరసన తెలుపుతున్న విద్యార్థి సంఘం నాయకులు, మృతుడి బంధువులు


రోదిస్తున్న ప్రేమ్‌సాయి తల్లి

పరీక్షల్లో చూశారనే గొడవ..!

- విద్యార్థి మృతిపై పోలీసు విచారణ
- పోలీసుల అదుపులో ఇద్దరు విద్యార్థులు

పుట్టపర్తి, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): ఈనెల 13న కళాశాలలో నిర్వహించిన పరీక్షల్లో వెనుక ఉన్న విద్యార్థి ప్రేమ్‌సాయి పేపరులోకి తొంగి చూసినట్లు తెలుస్తోంది. తన పేపరులో ఎందుకు చూస్తున్నావని ప్రేమ్ సాయి ప్రశ్నించగా మాటామాటా పెరిగింది. దీంతో అతడు కళాశాల లెక్చరర్‌కు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. దీనిపై ఆగ్రహించిన ఇద్దరు తోటి విద్యార్థులు మాపైనే ఫిర్యాదు చేస్తావా అంటూ కళాశాల క్యాంపస్‌లోనే ప్రేమ్‌సాయిపై దాడి చేశారు. ఈక్రమంలో అతడి చెవిపై దెబ్బలు పడినట్లు తెలిసింది. అనంతరం హాస్టల్‌కు వెళ్లిన ప్రేమసాయి తనకు చెవి నొప్పి తీవ్రంగా ఉందని చెప్పి హిందూపురానికి వెళ్లాడు. చెవినొప్పితో శుక్రవారం హిందూపురంలో ఈఎన్‌టీ వైద్యుడి వద్దకు వెళ్లారు. ఈ సందర్భంలో తనపై దాడి జరిగిన తీరు ఆ విద్యార్థి తన తల్లిదండ్రులకు చెప్పినట్లు తెలుస్తోంది. ప్రేమ్‌సాయిపై దాడి చేసిన ఇద్దరు విద్యారులను పోలీసులు గుర్తించి అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టినట్లు తెలుస్తోంది. చెవిపై గట్టిగా కొట్టడంతోనే రెండు రోజుల తరువాత విద్యార్థి మృతి చెందినట్లు ప్రాథమిక నిర్ధారణకు పోలీసులు వచ్చినట్లు తెలుస్తోంది.

పోలీసుల విచారణ

ఇంజనీరింగ్ కళాశాలలో తోటి విద్యార్థుల దాడిలో గాయపడి మృతి చెందిన బీటెక్ విద్యార్థి ప్రేమ్‌సాయి కేసును పోలీసులు విచారణ చేపట్టారు. పుట్టపర్తి సమీపంలోని ఇంజనీరింగ్ కళాశాలకు అర్బన్ సీఐ సునీత తన సిబ్బందితో శనివారం వెళ్లి ఘటనపై ఆరా తీశారు. ప్రేమ్‌సాయిని ఇంజనీరింగ్ కళాశాలలో చదివే తోటి విద్యార్థులు కొట్టడంతో చెవికి తీవ్రగాయం కావడం, ఆపై యాజమాన్యం నిర్లక్ష్యంతోనే తన కుమారుడు మృతి చెందినట్లు ప్రేమ్‌సాయి తండ్రి శ్రీనివాసులు హిందూపురం టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈనేపథ్యంలో కళాశాలకు వెళ్లి విద్యార్థి మృతిపై ప్రాథమిక విచారణ చేపట్టినట్లు పుట్టపర్తి అర్బన్ సీఐ సునీత వెల్లడించారు.


కళాశాల వద్ద పుట్టపర్తి అర్బన్ సీఐ సునీతతో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

పంటి నొప్పి కారణంగా ఇంటికి వెళ్తున్నానని, అనుమతి ఇవ్వాలని హాస్టల్ వార్డెన్‌కు ప్రేమ్‌సాయి దరఖాస్తు చేశాడు. 13న సాయంత్రం అతడి తల్లిదండ్రులకు తాము విషయం చెప్పిన తరువాతే అనుమతి ఇచ్చి ఇంటికి పంపించాం. విద్యార్థి మృతిపై పోలీసు విచారణ సాగుతోంది. తోటి విద్యార్థులు దాడి చేసినట్లు ప్రేమ్‌సాయి ఎక్కడా ఫిర్యాదు చేయలేదు. విద్యార్థుల మధ్య గొడవ, దాడి జరిగినట్లు వస్తున్న ఆరోపణల్లో నిజం లేదు. - **కళాశాల యాజమాన్యం**

విద్యార్థి మృతిపై నిజాలు నిగ్గు తేల్చాలి: సీపీఎం

బీటెక్ విద్యార్థి ప్రేమ్‌సాయి అనుమానాస్పద మృతిపై నిజాలు నిగ్గు తేల్చాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఇంతియాజ్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి వెంకటేసులు డిమాండ్ చేశారు. శనివారం పుట్టపర్తిలో ఇంజనీరింగ్ కళాశాలకు వెళ్లి విద్యార్థి మృతిపై యాజమాన్యంతోపాటు పోలీసులతో ఆరా తీశారు. ఇంతియాజ్ మాట్లాడుతూ విద్యార్థి మృతికి కళాశాల యాజమాన్యం పూర్తి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. పోలీసులు నిష్పక్షపాతంగా విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

భూ దురాక్రమణ నిషేధ బిల్లుపై అఖిలపక్ష సమావేశం జరపాలి

సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్


మాట్లాడుతున్న రాంభూపాల్

అనంతపురం కల్చరల్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): భూ దురాక్రమణ నిషేధ బిల్లు-2024పై అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్ డిమాండ్ చేశారు. శనివారం స్థానిక గణేనాయక్ భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... భూ దురాక్రమణ నిషేధ బిల్లు-2024లో కొన్ని అంశాలు పేదలపైన, పేదల పక్షాన నిలబడే ప్రజా ఉద్యమాలను అణచివేయడానికి ఉద్దేశించినవిగా ఉన్నాయని విమర్శించారు. అభ్యంతరకరమైన వాటిని తొలగించి అక్రమంగా, దౌర్జన్యంగా ఆక్రమించుకున్న దురాక్రమణదారులకు శిక్ష విధించేలా, పేదలకు న్యాయం చేకూర్చేలా ఈ చట్టాన్ని సవరించడానికి సమావేశం నిర్వహించాలన్నారు. రాష్ట్రంలో భూ దురాక్రమణల సమస్య ఉందని, అనేక మంది భూ యజమానులు తీవ్ర కష్టాలెదుర్కొంటున్నారని, పట్టణీకరణ, వ్యాపారీకరణ, పారిశ్రామికీకరణ నేపథ్యంలో భూ దురాక్రమణను అరికట్టేందుకు 1982 చట్టాన్ని రద్దు చేసి, ఆ స్థానంలో భూ దురాక్రమణ నిషేధ చట్టం 2024ను శాసనసభలో ప్రవేశపెట్టినట్లు ప్రభుత్వం చెబుతోందన్నారు. గత వైసీపీ ప్రభుత్వం ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ తరహాలో ఈ చట్టం చేయాలని ప్రయత్నించి ప్రజలనుంచి వ్యతిరేకత రావడంతో వెనక్కు తగ్గిందన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం అదే విధానాన్ని కొనసాగించడం సరికాదన్నారు. రెండున్నర ఎకరాల మాగాణి, ఐదు ఎకరాల మెట్టలోపు సొంత భూములు కలిగిన పేద, మధ్యతరగి రైతులు, సొంత ఇల్లు లేని పట్టణ, గ్రామీణ పేదలు ప్రభుత్వ భూమి కలిగి ఉంటే వారికి ఈ చట్టం నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నల్లప్ప, బాలరంగయ్య, నగర కార్యదర్శులు రామిరెడ్డి, ఆర్వీ నాయుడు పాల్గొన్నారు.

సేద్యం సినిమాకు అవార్డు


అవార్డు అందుకుంటున్న చంద్రకాంత్ పసుపులేటి

ధర్మవరం, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): జీఎంఎస్ గ్యాలరీ ఫిల్మ్స్ ఆధ్వర్యంలో ధర్మవరం పట్టణానికి చెందిన చంద్రకాంత్ పసుపులేటి దర్శకత్వంలో నిర్మించిన 'సేద్యం' సినిమాకు ఎంఈఐ సంస్థ ఉత్తమ సినిమా అవార్డు ప్రకటించింది. దర్శకుడు, రచయిత చంద్రకాంత్ మాట్లాడుతూ....రాయలసీమ రైతుల ఆత్మహత్యలపై సేద్యం సినిమాను తీశామన్నారు. ఈ సినిమాను గోరకాటి మహేశ్‌రెడ్డి, గాజుల పద్మావతి నిర్మించారని తెలిపారు. ఇందులో భాగంగా శుక్రవారం చెన్నైలో జరిగిన ఎంఈఐ అంతర్జాతీయ ఫిల్మ్ ఫెస్టివల్ అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమానికి 1200 సినిమాలు వచ్చాయని, ఇందులో సేద్యం సినిమాకు జాతీయ ఉత్తమ అవార్డు వచ్చిందన్నారు. ఈ అవార్డును డైరెక్టర్, ఎంఈఐ సంస్థ చైర్మన్ మురుగై చేతుల మీదుగా అందుకున్నట్టు చంద్రకాంత్ తెలిపారు.

'మాలగుండ్ల'ను అడ్డుకుంటాం

- మాజీ ఎమ్మెల్యేకు ఉష శ్రీచరణ్ వర్గం హెచ్చరిక


మాట్లాడుతున్న ఉష శ్రీచరణ్ వర్గీయులు

గోరంట్ల, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలో గ్రూపు రాజకీయాలను ప్రోత్సహించడానికి ప్రయత్నిస్తున్న మాజీ మంత్రి మాలగుండ్ల శంకరనారాయణ గోరంట్లకు వస్తే వైసీపీ నాయకులే అడ్డుకుంటారని మాజీ సింగల్‌విండో అధ్యక్షుడు, వైసీపీ నాయకుడు గంపల రమణారెడ్డి హెచ్చరించారు. టీడీపీ కార్యకర్త రంగప్ప ఇంటిపై దాడిచేసిన వానవోలు ఉప సర్పంచ్ కుటాల బాబు, శ్రీనివాసులును విడిపించడానికి శంకరనారాయణ రెండురోజుల కిందట గోరంట్ల పోలీస్ స్టేషన్‌కు తన వర్గీయులతో వెళ్లిన విషయం తెలిసిందే. ఈ సంఘటనపై వైసీపీ జిల్లా అధ్యక్షురాలు ఉష శ్రీచరణ్ వర్గీయులు గోరంట్లలోని పార్టీ కార్యాలయంలో శనివారం విలేకర్ల సమావేశంలో స్పందించారు. పార్టీ కోసం పని చేయడానికి వస్తే స్వాగతిస్తామని, మామధ్య చిచ్చుపెట్టాలని చూస్తూ సహించేదిలేదని రమణారెడ్డి తెలిపారు. పార్టీ కార్యక్రమాలు చేసే సమయంలో స్థానిక, పట్టణ, మండల కన్వీనర్లు తదితర ప్రముఖులు, జిల్లా అధ్యక్షులకు తెలిపితే కలిసి వస్తామని కన్వీనర్ వీరనారాయణరెడ్డి తెలిపారు. పార్టీ కార్యాలయం ప్రారంభోత్సవానికి తాము అందరిని ఆహ్వానించినా, శంకరనారాయణ వర్గం రాలేదన్నారు. పదేళ్లపాటు మీకోసం పార్టీ జెండా మోశాం. గ్రూపు రాజకీయాలు చేస్తూ, మాకు చెప్పకుండా దొంగలా వచ్చి పోవాల్సిన అవసరమేంటని ప్రశ్నించారు. వెన్నుపోటు రాజకీయాలు మాని, పార్టీ ఆదేశాల మేరకు పనిచేయాలని ఉప సర్పంచ్ రాజారెడ్డి హితవు పలికారు. వచ్చే ఎన్నికల్లో మీకు టిక్కెట్ కేటాయించినా, పార్టీ ఆదేశానుసారం పనిచేస్తామన్నారు. కార్యక్రమంలో పలువురు వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

- కాగా దాడికేసులో నిందితుడైన వానవోలు ఉప సర్పంచ్ కుటాల బాబు పార్టీ స్పందనతో సోషల్ మీడియా ద్వారా తన సందేశాన్ని ప్రకటించారు. తాను కూడ వైసీపీలోనే పనిచేస్తున్నానని, మీరు శంకరనారాయణను అడ్డుకుంటే, తాముకూడా ఉష శ్రీచరణ్‌ను అడ్డుకుంటామని హెచ్చరించారు.

సంక్షిప్తం

నేడు కోటి దీపోత్సవం

ఆత్మకూరు, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పంపనూరు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవాలయంలో ఆదివారం కోటి దీపోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి బాబు తెలిపారు. కార్తీక మాసం పురస్కరించుకుని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఆలయ ప్రాంగణంలో ఏర్పాట్లు చేశామన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

ఇళ్లకు దరఖాస్తు చేసుకోండి

రామగిరి, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇళ్లు లేని నిరుపేదలు ప్రభుత్వం మంజూరుచేసే గృహ నిర్మాణానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని హౌసింగ్ ఇన్‌చార్జ్ ఏఈ హరినాయక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకునే సంబంధిత సచివాలయంలోని ఇంజనీరింగ్ అసిస్టెంట్లను సంప్రదించి వివరాలు నమోదు చేసుకోవాలన్నారు.

గుర్తింపు కార్డు తప్పని సరి

● జిల్లా వ్యవసాయాధికారి

గార్లదిన్నె, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం కౌలు రైతులకు అందిస్తున్న గుర్తింపు కార్డుతో ఎంతో ప్రయోజనం ఉందని జిల్లా వ్యవసాయ అధికారి ఉమా మహేశ్వరమ్మ తెలిపారు. ప్రభుత్వం అందజేసే సాయం పొందే అవకాశం ఉంటుందన్నారు. మండలకేంద్రంలోని రైతు సేవా కేంద్రంలో శనివారం కౌలు రైతులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయాధికారి మాట్లాడుతూ... భూములను కౌలుకు తీసుకున్న రైతులు తప్పని సరిగా ప్రభుత్వం అందజేసే కౌలు గుర్తింపు కార్డులు తీసుకోవాలని సూచించారు. ఏడీఏ రవి, ఏఓ సోమశేఖర్, ఉద్యానఅధికారి రత్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

కనకదాస జయంతి కరపత్రాల విడుదల

అనంతపురం రూరల్/రాప్తాడు, నవంబరు16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సిండికేట్ నగర్‌లో శనివారం కురుబ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బోరంపల్లి ఆంజనేయులు ఆ సంఘం మండల అధ్యక్షుడు బండి ఈశ్వరయ్య నివాసంలో సమావేశం నిర్వహించారు. జిల్లా కార్యదర్శి మురళీ, నియోజకవర్గం అధ్యక్షులు నరేంద్ర హాజరయ్యారు. భక్త కనకదాస 537వ జయంతి మహా సభను సోమవారం నగర శివారుల్లోని కేటీ ఆర్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం మహాసభ కరపత్రాలను విడుదల చేశారు. నాయకులు బొజ్జయ్య, రామలింగ, నారాయణస్వామి, పల్లెప్ప, నాగేంద్ర, గంగాధర్, గంగప్ప, గోవిందప్ప తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా రాప్తాడులో బోరంపల్లి ఆంజనేయులు, కురుబ నాయకులతో సమావేశం నిర్వహించి కనకదాస జయంతిని విజయ వంతం చేయాలనే కరపత్రాలను విడుదల చేశారు. టీడీపీ మండల కన్వీనర్ పంపు కొండప్ప, గోనిపట్ల శీనా, కురుబ బీరన్న, గంగలకుంట కిష్టా, గేటు సత్తి తదితరులు పాల్గొన్నారు.

బీసీల అభివృద్ధి ప్రణాళికపై సమీక్ష

అనంతపురం అర్బన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : బీసీ కులాల అభివృద్ధి కోసం ప్రణాళికల తయారీపై బీసీ కార్పొరేషన్ ఈడీ సుబ్రహ్మణ్యం ఆయా బీసీ కులాల నాయకులతో సమావేశమయ్యారు. స్థానిక బీసీ కార్పొరేషన్ కార్యాలయంలో శనివారం టీడీపీ వడ్డెర్ల సంఘం నాయకులు దేవళ్ల మురళి, కుమ్మర శాలివాహన సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ పోతులయ్య, టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంచెపు వెంకటేష్, పద్మశాలి, నాయీ బ్రాహ్మణ కార్పోరేషన్ల డైరెక్టర్లు పోతుల లక్ష్మీనరసింహులు, కడియాల కొండన్న, ఆదినారాయణ తదితరులతో సమావేశమయ్యారు. పలు అంశాలపై చర్చించారు.

ఎన్‌ఎస్‌ఎస్ బృందానికి అభినందన

అనంతపురం సెంట్రల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఉత్తర గుజరాత్ యూనివర్సిటీలో నిర్వహించిన ఏడురోజుల జాతీయ సమైక్యతా శిబిరానికి వెళ్లివచ్చిన ఎస్కేయూ ఎన్‌ఎస్‌ఎస్ బృందాన్ని శనివారం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ అభినందించారు. ఎన్‌ఎస్‌ఎస్ అధికారి డాక్టర్ ఆధ్వ ర్యంలో జాతీయ స్థాయి శిబిరానికు వెళ్లి జిల్లా ఖ్యాతిని చాటడం హర్షణీయమని కొనియాడారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక


ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

బుక్కరాయసముద్రం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జాతీయ స్థాయి పోటీలకు బుక్కరాయ సముద్రం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపి కయ్యారు. ఈ పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి బేస్‌బాల్, నెట్‌బాల్, బాస్కెట్ బాల్ పోటీలలో ప్రతిభ చూపి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పీఈటీ గోపాల్‌రెడ్డి తెలిపారు. బేస్‌బాల్ అండర్-17 లో పదోతరగతి విద్యార్థి మోహన్ ఢిల్లీలో జరిగే జాతీయ స్థాయి పోటీలలో పాల్గొనున్నట్లు తెలిపారు. అండర్-19 నెట్‌బాల్ పోటీల్లో సంధ్య, చరణ్ (తొమ్మిదో తరగతి) చత్తీస్‌ఘడ్ రాష్ట్రంలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారు. అలాగే నెట్‌బాల్ అండర్-14లో ధరణి, ధ్రువన్, గౌతమ్... బాస్కెట్‌బాల్ అండర్-14లో రాష్ట్ర స్థాయిలో రాజు, గణేశ్ ప్రతిభ చాటారు. జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనే విద్యార్థులను, రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చూపిన విద్యార్థులను ప్రధానోపాధ్యాయరాలు వసుంధర, పీఈటీలు గోపాల్‌రెడ్డి, లలితమ్మ ఇతర ఉపాధ్యాయులు శనివారం పాఠశాలలో అభినందించారు.

మతలబు ఏంటి..?

● కుక్కల నియంత్రణ, వ్యాక్సినేషన్ వ్యవహారంపై పలువురి సందేహాలు
● రూ.14లక్షల చెక్కు ఇచ్చిన కమిషనర్
● అంతలోనే సంస్థ ఖాతాకు జమ చేయవద్దని కోరిన వైనం



అనంతపురం క్రైం, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): నగరపాలికలో అడ్డగోలు వ్యవహారాలు ఎక్కువగానే జరుగుతున్న బహిరంగ విమర్శలు ఉన్నాయి. తాజాగా నగరపాలిక కమిషనర్ కొన్ని రోజుల క్రితం రూ.14లక్షలకు చెక్కు ఇచ్చారు. కానీ ఆ డబ్బు జమ చేయవద్దని కమిషనర్ చెప్పడం చర్చనీయాంశంగా మారింది. ఒత్తిళ్లతో నగర కమిషనర్ ఆ పనిచేశారా..? లేక ఏదైనా మతల బుందా..?అనేది అంతుబట్టడం లేదు. గత ప్రభుత్వంలో కుక్కల నియంత్రణ (ఏబీసీ), యాంటీ రాబిస్ వ్యాక్సినేషన్ కోసం రాష్ట్ర వ్యాప్తంగా రాజస్థాన్ రాష్ట్రంలోని జైపూర్‌కు చెందిన సం తులన్ జీవ్ కళ్యాణ్ అనే సంస్థ టెండరు దక్కించుకుంది. నగరపాలికలో కుక్కలను పట్టింది. ఈ ప్రక్రియను పశుసంవర్ధక శాఖకు అనుసంధానం చేశారు. కొన్ని కుక్క లను పట్టి ఆపరేషన్ చేశామని, వ్యాక్సినేషన్ వేశామని సంస్థ చెప్పుకొచ్చింది. అందుకు సంబంధించి కొన్ని రోజుల క్రితం రూ.14లక్షల చెక్కును అందజేశారు. దీనిపై ప్రస్తుతం వివాదం రేగుతోంది.

ఒక్కో కుక్కకు రూ.1500...

నగరపాలిక పరిధిలో కుక్కల నియంత్రణ కోసం సంతులన్ జీవ్ కళ్యాణ్ ఏజెన్సీ నగరానికి వచ్చింది. గుత్తి రోడ్డులోని డంపింగ్‌యార్డు ఆవరణలో ప్రత్యేకంగా షెడ్డు నిర్మించి, అందులో కుక్కల నియంత్రణ, వ్యాక్సినేషన్ కార్యక్రమం చేపట్టారు. 2023లో టెండరు దక్కించుకున్న ఈ ఏజెన్సీ నగరపాలికలో ఈ ఏడాది ఫిబ్రవరిలో ఆ కార్యక్రమం చేపట్టింది. అయితే గుట్టుగా చేస్తున్నారనే ఆరోపణలు వినిపించాయి. 2500 కుక్కలకు ఆపరేషన్ చేసినట్లు ఆ సంస్థ చెప్పుకొచ్చింది. ఆ మేరకు రూ.40లక్షలకు బిల్లులు పెట్టారు. అయితే తొలుత 976 కుక్కలకు రూ.1500 చొప్పున రూ.14,64,400కు బిల్లు సిద్ధం చేయడంపైనా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వాస్తవానికి ఇంజనీరింగ్ విభాగం నుంచే బిల్లు వెళ్లాలి. కానీ హెల్త్ విభాగం నుంచి వెళ్లింది. ఎఫ్1 నుంచి వెళ్లిన ఆ ఫైల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, ఎంహెచ్‌ఓ ద్వారా నేరుగా అప్పటి కమిషనర్‌కు చేరిది. ఈ యేడాది జూన్‌లో ఆ ఫైల్‌పై అప్పటి కమిషనర్ మేఘస్వరూప్ సంతకం చేసి అప్రూవల్ ఇచ్చినా పేమెంట్ చేయించలేదు. తరువాత వచ్చిన కమిషనర్ పీవీవీఎస్ మూర్తి ఆ ఫైల్‌ను పూర్తిగా పక్కన పెట్టేశారు.

చెక్కు ఇచ్చారు...పేమెంట్ వద్దన్నారు

నగర కమిషనర్ జనరల్ ఫండ్ నుంచి రూ.14,34,720 చెక్కును ఆ ఏజెన్సీకి అందజేశారు. ఇక్కడ కమిషనర్ చెక్కు రూపంలో ఇవ్వడంపైనా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వాస్తవంగా సీఎఫ్‌ఎంఎస్‌లో బిల్లు పెట్టాలి. అత్య వసర పనులైన వాటర్ వర్క్స్ లాంటి పనులకు తప్ప మిగిలినవాటికి చెక్కులివ్వరని నగరపాలిక వర్గాలు చెబుతున్నాయి. మరి కమిషనర్‌పై ఒత్తిళ్లు పనిచేశాయా..?లేక ఎవరైనా అమ్యామ్యాలకు పాల్పడి కమిషనర్‌ను బురిడీ కొట్టించారా..?అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఆ రూ.14లక్షలతో పాటు మిగిలిన బిల్లులు చేయించుకునే క్రమంలో కొందరికి డబ్బులిచ్చారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ నెల 12 మేయర్ చాంబర్‌లో ఇంజనీర్లతో జరిగిన సమావేశంలో మేయ ర్, డిప్యూటీ మేయర్ దీనిపై కమిషనర్‌తో వాదనకు దిగారు. రూ.14 లక్షల చెక్కు ఎందుకిచ్చారని వారు ప్రశ్నించగా, నిబంధనల మేరకే ఇచ్చానని కమిషనర్ సమాధానమిచ్చారు. కౌన్సిల్‌లో లేవనెత్తుతామని వారనగా...తాను తన స్టాండ్‌పై ఉంటానన్నారు. కానీ విచిత్రంగా అదే రోజు కమిషనర్ సంబంధిత బ్యాంకు మేనేజర్‌కు ఆ చెక్కు ద్వారా జరిగే పేమెంట్‌ను ఆపాల ని లేఖ రాయడం గమనార్హం. ఇది హాట్ టాపిక్‌గా మారింది.

నిబంధనల మేరకే...

నిబంధనల మేరకే సంతులన్ జీవ్ కళ్యాణ్ ఏజెన్సీ వారికి రూ.14లక్షల చెక్కు అందజేశాం. అందులో ఎలాంటి తప్పు లేదు. అయితే స్టాప్ చేయమని బ్యాంకు వారిని కోరాం. విచారించి ఇస్తామని ఏజెన్సీ వారికి చెప్పాం. మిగిలిన విషయాలు సందర్భం వచ్చినప్పుడు చెబుతాం. - నాగరాజు, కమిషనర్

అపార్‌పై ప్రత్యేక దృష్టిపెట్టండి : కలెక్టర్


మాట్లాడుతున్న కలెక్టర్

అనంతపురంటౌన్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల భవిష్యత్తుకు సం బంధించిన అపార్ జనరేషన్ ప్రక్రియపై ప్రత్యేక దృష్టిపెట్టాలని కలెక్టర్ వినోద్‌కుమార్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో శనివారం అ పార్‌పై సమీక్షించారు. జిల్లా లో ప్రతిరోజు 10వేల నుంచి 15వేల వరకు అపార్ జనరేషన్ జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. అన్ని జూనియర్ కళాశాలలు, పాఠశాలల్లో వేగంగా ఈ ప్రక్రియ సాగేందుకు ప్రిన్సిపాళ్లు, ప్రధానోపాధ్యాయులు, ఎంఈఓలు చర్యలు చేపట్టాలన్నారు. అపార్ లో బర్త్ సర్టిఫకెట్ మంజూరుకు సంబంధించి నెలకొన్న సందేహాలపై డిజిటల్ అసిస్టెంట్లకు అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో డీఈఓ ప్రసాద్‌బాబు, డీవీఈఓ వెంకటరమణనాయక్, ఆధార్‌నోడల్ ఆఫీసర్ నారపరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వందశాతం లక్ష్య సాధనకు కృషి చేయాలి

ప్రభుత్వం అప్పగించిన పథకాల లక్ష్యాలను వందశాత పూర్తిచేసేందుకు కృషి చేయాలని కలెక్టర్ వినోద్‌కుమార్ అధికారులను ఆదేశించారు. ఆయన శనివారం కలెక్టరేట్ నుంచి డీపీఓ, డీఎల్‌డీఓలు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పలు అంశాలపై సమీక్షించారు. ప్రతి ఇంటికి సచివా లయ ఉద్యోగులు వెళ్లి ఇళ్ల జియో జియోకోఆర్డినేట్స్ అప్‌డేట్‌ను వందశాతం పూర్తిచేయాలన్నారు. జిల్లాలో ఇప్పటివరకు 65.46 శాతం పూర్తయిందన్నారు. ప్రభుత్వపథకాలకు సంబంధించి లబ్ధిదారుల బ్యాంకు అకౌంట్‌కు ఆధార్‌లింకు పెట్టి ఈకేవైసీ చేయించాలన్నారు. ఇదికూడా జిల్లాలలో ఇప్పటికి 75.69శాతం మాత్రమే పూర్తి చేశారని, మిగిలిన దానిని మూడురోజులలో చేయించాలని ఆదేశించారు.

సామగ్రి మాయంపై కలెక్టర్ సీరియస్



డ్వామా కార్యాలయం

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): డ్వామాలో చోటు చేసుకుంటున్న పరిణామాల పై జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్ సీరియస్ అయ్యారు. తాజాగా ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన 'అదృశ్యమైన వస్తువులు ప్రత్యక్షం' అనే కథనానికి జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్ స్పందించారు. డ్వామాలో జరుగుతున్న పరిణామాలపై విచారణకు ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు వాటర్‌షెడ్ అడిషినల్ పీడీ సుధాకర్‌రెడ్డిని విచారణాధికారిగా డ్వామా పీడీ సలీంబాషా నియమించారు. ఆ విచారణలో సంచలన విషయాలు బయటపడుతున్నట్లు సమాచారం. డ్వామా పీడీ కార్యాలయం, బంగ్లాలో సామగ్రి మాయం కావడం ఇదే తొలిసారి కాదని... సుమారు 15-20 ఏళ్లుగా ఈ తంతు సాగుతున్నట్లు తెలుస్తోంది. పీడీ బదిలీ అయిన ప్రతి సారి ఇలాగే జరుగుతోందని సమాచారం. అయితే ఈ సారి విషయం బహిర్గతమైంది. ఇటీవల డ్వామా నుంచి పీడీతో పాటు పలువురు అధికారులు బదిలీపై వెళ్లారు. ఈ విషయాలు బయటకు పొక్క డంతో ఇందులో కీలకంగా ఉండే ఓ ఉద్యోగి కూడా అవన్నీ తన మెడకు చుట్టుకుంటాయని కలెక్టర్ బంగ్లాకు మకాం మార్చినట్లు తెలుస్తోంది.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

డీఎస్‌డీఓ అక్రమాలపై విచారణకు ఆదేశం

జిల్లా క్రీడాప్రాధికార సంస్థ (డీఎస్‌డీఓ) అధికారి షఫీ అవినీతి, అక్రమాలపై విచారణకు ప్రభుత్వం ఆదేశించింది. ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన వరుస క్రీడాశాఖ కథనాలతో స్పందించిన ప్రభుత్వం ఇటీవల డీఎస్‌డీఓ షఫీని సస్పెండ్ చేసింది. విచారణ బాధ్యతను కలెక్టర్ వినోద్ కుమార్‌కు అప్పగించారు. వారం రోజుల్లో విచారణ చేసి తనకు నివేదిక అందజేయాలని జిల్లా యువజన సంక్షేమశాఖ అధికారి, ఆన్‌సెట్ సీఈఓ వెంకటేశ్వర్లును నియమిస్తూ కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. దానిని రాష్ట్ర ప్రభుత్వానికి పంపుతామని కలెక్టర్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. శాప్‌లో సాధారణ ఖో-ఖో కోచ్‌గా ఉండే షఫీని గత వైసీపీ ప్రభుత్వం ఇన్‌చార్జి డీఎస్‌డీఓగా నియమించింది. అయితే అప్పటి నుంచి ఆయన నిధుల వినియోగంలో గోల్‌మాల్ చేశారని విచారణలో తేలుతున్నట్లు సమాచారం.

పేదల స్థలాలకు ఎసరుపై అధికారుల ఆరా

అనంతపురం రూరల్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నంపల్లి పంచాయతీ కురుగుంట గ్రామ సర్వే నెంబరు 320-1లో పచ్చి టెంకాయల వ్యాపారులకు ఇంటి పట్టాలు మంజూరు చేసిన విషయం విదితమే. అయితే కొంతమంది అధికార, ప్రతి పక్ష నాయకులు ఆ స్థలాలను దక్కించుకునేందుకు పన్నాగం పన్నుతున్నారని 'పేదల స్థలాలకు ఎసరు' అన్న శీర్షికతో శనివారం ఆంధ్రతజ్యోతి కథనం ప్రచురించింది. ఈ కథనంపై జిల్లా ఉన్నతాధికారులు స్పందించారు. ఈక్రమంలోనే కలెక్టర్ వినోద్‌కుమార్ మండల రెవెన్యూ అధికారులతో మాట్లాడినట్లు తెలుస్తోంది. పేదలకు ఇళ్ల స్థలాల విషయంలో ఎలాంటి చర్యలు తీసుకోవాలనే వాటిపై అయా వర్గాల ద్వారా తెలుస్తోంది. అదేవిధంగా ఆర్డీఓ కేశవనాయుడు ఇదే విషయంపై అధికారులతో మాట్లాడినట్లు సమాచారం.

మందకృష్ణకు 'వైకుంఠం' ఆతిథ్యం


వైకుంఠం ప్రభాకర్ చౌదరి నివాసంలో భోజనం చేస్తున్న మందకృష్ణ మాదిగ

అనంతపురం అర్బన్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగకు టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్ చౌదరి ఆతిథ్యం ఇచ్చారు. జిల్లా పర్యటనకు వచ్చిన ఆయనను శనివారం రాత్రి వైకుంఠం ప్రభాకర్ చౌదరి అతిథిగా ఆహ్వానించారు. పలువురు టీడీపీ నాయకులు, ఎమ్మార్పీఎస్ నాయకులతో కలిసి మందకృష్ణ మాదిగ భోజనం చేశారు. ఆ తర్వాత రాజకీయ పరిణామాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ గంపన్న, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి దేవళ్ల మురళి, బంగి నాగ, బండారు శంకర్ తదితరులు పాల్గొన్నారు.

అనంతలో చిన్నతరహా పరిశ్రమలు పెట్టండి

ఎమ్మెల్యే దగ్గుపాటి విజ్ఞప్తి


కాంటినెంటల్ కాఫీ యాజమాన్యంతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

అనంతపురం అర్బన్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): నగర పరిసర ప్రాంతాల్లో చిన్న తరహా పరిశ్రమలు ఏర్పాటు చేసి, స్థానిక ప్రజలకు ఉపాధి అవకాశాలు కల్పించేలా చొరవ చూపాలని కాంటినెంటల్ కాఫీ సంస్థ యాజమాన్యాన్ని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ కోరారు. విజయవాడలోని కాంటినెంటల్ కాఫీ పరిశ్రమను ఎమ్మెల్యే శనివారం పరిశీలించారు. ఆ సంస్థ అధినేత రాజేంద్ర ప్రసాద్, డైరెక్టర్ మోహన్‌తో పలు అంశాలపై చర్చించారు. ఎక్కువ మందికి ఉపాధి కల్పించే చిన్న తరహా పరిశ్రమలకు అనంతపురం ప్రాంతం అనుకూలంగా ఉంటుందన్నారు. అందుకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తానన్నారు.

మార్చిలోగా అన్ని గ్రామాలకు తాగునీరందాలి

● ఎమ్మెల్యే పరిటాల సునీత


అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

అనంతపురం అర్బన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : రాప్తాడు నియోజకవర్గంలోని అన్ని గ్రామాలకు వచ్చే మార్చిలోగా తాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఎమ్మెల్యే పరిటాల సునీత ఆదేశించారు. నగరంలోని ఆమె క్యాంప్ కార్యాలయంలో శనివారం ఆర్‌డబ్ల్యూఎస్, పర్యాటక శాఖ అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. రాప్తాడు నియోజకవర్గానికి తాగునీటి అవసరాల కోసం పీఏబీఆర్ నుంచి అనంతపురం వరకు వేస్తున్న పైప్‌లైన్ పనులు మధ్యలోనే ఆగిపోవడంపై ఆరా తీశారు. ప్రభుత్వం నుంచి అనుమతులు తీసుకొస్తామన్నారు. దీంతోపాటు దెబ్బతిన్న పైప్‌లైన్ల మరమ్మతులు, ఎక్కడైనా కొత్త లైన్లు వేయాల్సి ఉంటే ఆ పనులను చేపట్టాలన్నారు. గ్రామాల్లో అన్ని చోట్లా కొళాయి కనెక్షన్లు ఇవ్వాలని, ఓవర్ హెడ్ ట్యాంక్‌లలో నీరు ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రామగిరి, కనగానపల్లి, చెన్నేకొత్తపల్లి మండలాల్లోని అన్ని గ్రామాలకు తాగునీటి అవసరాల కోసం గొల్లపల్లి రిజర్వాయర్ నుంచి సీపీడబ్ల్యూఎస్ పథకం నిర్మాణానికి రూ.180 కోట్లు అవసరమని అంచనా వేశామన్నారు. జాతీయ రహదారి పక్కన, పంపనూరు అటవీ ప్రాంతంలో పైప్‌లైన్ ఏర్పాటుకు కావాల్సిన అనుమతుల అంశాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. గత ప్రభుత్వం నిర్లక్ష్యంతో ఆగిపోయిన పనులను మళ్లీ ప్రారంభిస్తామని తెలిపారు. రాప్తాడు నియోజకవర్గంలో పర్యాటక అభివృద్ధికి చర్యలు తీసుకోవాలన్నారు. రామగిరి మండలం వెంకటాపురంలో రూ.2.50 కోట్లతో తిరుమల దేవర స్వామి ఆలయంలో పర్యాటక సౌకర్యాలు, దుర్గాదేవి ఆలయానికి మెట్లు ఏర్పాటు చేశామన్నారు. రూ.50 లక్షలతో శివాలయాన్ని అభివృద్ధి చేశామన్నారు. ఆత్మకూరు జాతీయ రహదారి సమీపంలో పర్యాటకానికి సౌకర్యాలు కల్పించాల్సి ఉందన్నారు. నసనకోట ముత్యాలమ్మ ఆలయం, సీకేపల్లి మండలం కోన శివాలయాల వద్ద పిల్లలు ఆడుకునేందుకు ఆట స్థలం, టూరిజం రెస్టారెంట్, మరుగు దొడ్లు నిర్మించాలన్నారు. పేరూరు డ్యాం వద్ద బోటింగ్ అభివృద్ధి కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు.

బస్సులో బంగారు నగల మాయంపై కేసు

అనంతపురం క్రైం,నవంబరు 16(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సులో సెప్టెంబరు నెలలో జరిగిన నగల మాయం ఘటనపై వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో శనివారం రాత్రి కేసు నమోదైంది. వేణుగోపాల్‌నగర్‌కు చెందిన దూదేకుల సారంబి అనే మహిళ సెప్టెంబరు నెల 15వ తేదీ గుత్తి నుంచి బస్సులో బయలుదేరింది. స్థానిక గుత్తిరోడ్డులో దిగింది. బ్యాగులో చూసుకుంటే రూ.3లక్షల విలువైన బంగారు గొలుసు, కమ్మలు, మ్యాటీలు కనిపించలేదు. పలువురితో ఆరా తీసినా అవి దొరకలేదు. దీంతో ఐదు రోజుల క్రితం వన్‌టౌన్ పోలీసులను ఆశ్రయించింది. పోలీసులు సీసీ పుటేజీలు పరిశీలించారు. కానీ ఎలాంటి క్లూస్ లభించలేదు. దీంతో శనివారం రాత్రి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'పచ్చని గ్రామాల్లో చిచ్చురేపుతున్న వైసీపీ'

అత్మకూరు, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): పచ్చని గ్రామాల్లో వైసీపీ నాయకులు గొడవలు సృష్టించి పైశాచిక ఆనందం పొందుతున్నారని టీఎన్‌ఎస్‌ఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండి పరశురామ్ మండిపడ్డారు. మండలపరిధిలోని బి. యాలేరులో వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం చేతులను వైసీపీ వారే విరగగొట్టి టీడీపీ నాయకులపై బురద చల్లుతున్నారని ఆయన ఆరోపించారు. ఆయన శనివారం మండలకేంద్రంలో విలేకరుల సమావేశంలో మా ట్లాడుతూ... ఎమ్మెల్యేగా పరిటాల సునీత ఎన్నికయిన తరువాత గ్రామంలో చేస్తున్న అభివృద్ధి ఓర్వలేక లేనిపోని విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. గ్రామాల్లో చిచ్చు పెట్టి ప్రజలను ఇబ్బంది పెట్టకుండా అభివృద్ధికి సహకరించాలని కోరారు.

ఎమ్మార్పీకే మద్యం విక్రయించాలి : ఎక్సైజ్ కమిషనర్

చెన్నేకొత్తపల్లి, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): మద్యం దుకాణాల్లో ఎమ్మార్పీ ధరలకే మద్యం విక్రయాలు జరపాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్‌శాఖ కమిషనర్ నాగమద్దయ్య తెలిపారు. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్‌శాఖ కమిషనర్ నాగమద్దయ్య ఆశాఖ, ఎన్‌పోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ మునిస్వామితో కలిసి శనివారం చెన్నేకొత్తపల్లి ఎక్సైజ్ కార్యాలయాన్ని తనిఖీ చేశా రికార్డులను పరిశీలించారు. మూడు మండలాల ఎక్సైజ్ క్రైంలో భాగంగా ఎన్‌డీపీఎల్, నాటుసారా, బెలుషాపులు తదితర నేరాల గురించి సీఐ ఫరూక్ అజాంను అడిగితెలుసుకున్నారు. మద్యం దుకాణాలను ప్రభుత్వ నిబంధనల మేరకు నిర్వహించాలని, ఎమ్మార్పీ ధరలకే మద్యం విక్రయించాలని ఆయన సూచించారు.

పంట నష్టపోయిన రైతులను ఆదుకుంటాం

● ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

శింగనమల, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలో ఇటీవలన కురిషిన వర్షాలకు చాలా మంది రైతులు పంటలు నష్ట పోయాని, వారందరినీ ప్రభుత్వం ఆదుకుంటుదని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ పెర్కొన్నారు. మూడు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు నియోజకవర్గం వ్యాప్తంగా అనేక పంటలు నష్టపోవడంతో ఆమె శనివారం నియోజకవర్గంలోని తహసీల్దార్, వ్యవసాయాధికారులతో ఫోన్‌ద్వారా సమీక్షించారు. వర్షాలకు చాలా గ్రామాల్లో చేతికి వచ్చిన పంట తడిపోయిందని, వరి పంట నేలకు వాలిపోయిందన్నారు. ఇతర పంటలకు తీవ్రంగా నష్టం జరిగిందన్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి నష్టపొయిన ప్రతి రైతు పేరు నమోదు చేయాలని, పంట నష్టం అంచనాలు తయారు చేయాలని ఆదేశించారు. రైతులను ప్రభుత్వం అందుకుటుందన్నారు.

తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలి

శింగనమల నియోజకవర్గంలో వర్షాలకు తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలని జాయింట్ కలెక్టర్ శివనారాయణశర్మకు ఎమ్మెల్యే సోదరి బండారు కిన్నెరశ్రీ విన్నవించారు. ఆమె శనివారం అనంతపురంలో జేసీని కలసి ఇటీవల కురిసిన వర్షాలకు వరి ధాన్యం తడిసిపోయిందని, దీంతో వ్యాపారులు ఈ ధాన్యం కొనుగోలు మందుకు రావడం లేదని వివరించారు.

వేతన బకాయిలివ్వండి : సీపీఎం

బుక్కరాయసముద్రం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్మికులు మూడు నెలల వేతన బకాయిలు ఇవ్వాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ఓ నల్లప్ప డిమాండ్ చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద శనివారం గ్రామ పంచాయతీ కార్మికులు, సీపీఎం నేతలు అందోళన చేశారు. పంచాయతీ కార్మికులకు వేతనాలు సరిగా ఇవ్వడం లేద న్నారు. వెంటనే పంచాయతీ కార్మికులకు వేత నాలు ఇవ్వాలని ఈఓఆర్డీ సదాశివానికి వినతి పత్రం అందజేశారు. సీఐటీయూ నాయకులు జయ, ఎర్రినాగయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కల్పనలో సొసైటీలు కీలకం

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి) : నిరు ద్యోగులకు ఉపాధి కల్పన, వారు నైపుణ్యాభివృద్ధి పెంపొందించు కోవడంలో సహకార సొసైటీల పాత్ర కీలకమని సబ్‌డివిజనల్ కోఆపరేటివ్ ఆఫీసర్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ బాలగంగాధర్ తెలి పారు. 71వ అఖిల భారత సహకార వారోత్సవాల్లో భాగంగా శని వారం స్థానిక పాతూరులోని ఏడీసీసీ బ్యాంకులో వ్యవస్థాపకత - ఉపాధికల్పన - నైపుణ్యాభివృద్ధిలో సహకార సంఘాల పాత్ర అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా బాలగంగాధర్ మాట్లాడారు. అనంతరం సహకార ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహకార విద్యాధికారి మురళీమోహన్, పీఐసీలు సృజన్, మల్లికార్జున, ఏడీసీసీ బ్యాంకు మేనేజర్ స్టీఫెన్‌కుమార్, సిబ్బంది, ఖాతాదారులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌సీటీసీలో... సహకార వారోత్సవాల్లో భాగంగా మూడో రోజు స్థానిక రామ్‌నగర్‌లోని రాయలసీమ సహకార శిక్షణా కేంద్రంలో ప్రిన్సిపాల్ శ్రీనివాసులు అధ్యక్షతన సదస్సు నిర్వహించారు. ప్రముఖ వక్త బత్తలపల్లి సత్యరంగారావు శిక్షణార్థులకు కమ్యూనికేషన్ స్కిల్స్‌పై అవగాహన కల్పించారు. సహకార వ్యవస్థపై వివరించారు.

స్కిల్ డిజైనర్‌తో ఒప్పందం

అనంతపురం సెంట్రల్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సులు, ఇంటర్న్‌షిప్ అవకాశాలను కల్పించేందుకు హైదరాబాద్‌కు చెందిన స్కిల్‌డిజైనర్ ప్రైవేట్ సంస్థతో ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్లు జేఎన్‌టీయూ ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ సుదర్శనరావు తెలిపారు. శనివారం రిజిస్ట్రార్ క్రిష్ణ య్యతో కలిసి స్కిల్‌డిజైనర్ సంస్థ ప్రతినిధులతో వీసీ సమావే శమయ్యారు. కార్యక్రమంలో పలువురు వర్సిటీ డైరెక్టర్లతో పాటు సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

అమరావతికి లోకాయుక్త తరలింపు ఆపాలి: దాదాగాంధీ

అనంతపురం న్యూటౌన్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మానవ హక్కుల కమిషన్, లోకాయుక్తను అమరావతికి తరలించే ప్రక్రియను మానుకోవాలని కాంగ్రెస్ పార్టీ అనంతపురం ఇన్‌చార్జ్ దాదాగాంధీ డిమాండ్ చేశారు. నగరంలోని పార్టీ కార్యాలయంలో ఆయన శనివారం విలేకరుల సమావేశంలో మట్లాడారు. ఉన్నఫలంగా రాయలసీమ నుంచి హెచ్‌ఆర్సీ, లో కాయుక్తను అమరావతికి తరలించే ప్రక్రియను వెంటనే నిలిపి వేయాలన్నారు.

కుక్కల నుంచి ప్రజలను కాపాడండి

అనంతపురం అర్బన్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): నగరంలో కుక్కల బెడద నుంచి ప్రజలు, చిన్న పిల్లలను కాపాడాలని టీడీపీ ముస్లిం మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సైపుద్దీన్ ఒక ప్రకటన లో పేర్కొన్నారు. వీధి కుక్కలకు యాంటీ రేబీస్ వ్యాక్సిన్ వేయడంతోపాటు కుక్కల బెడద నుంచి పిల్లలను కాపాడేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.

క్లుప్తంగా..

రేపు సచివాలయాల వద్ద ధర్నా

గుంతకల్లుటౌన్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): పేదలకు ఇంటి స్థలాల ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సీపీఐ ఆధ్వర్యంలో సోమవారం గ్రామ, వార్డు సచివాలయాల వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు ఆ పార్టీ నియోజకవర్గ కార్యదర్శి వీరభద్ర స్వామి, మండల కార్యదర్శి రాముడురాయల్ తెలిపారు. మండలంలోని కసాపురంలో శనివారం వారు ఈ మేరకు కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పేదలకు గ్రామీణ ప్రాంతాల్లో 3సెంట్లు, పట్టణాలలో 2సెంట్ల ఇళ్ల స్థలాలను ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. అలాగే ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు నాగరాజు, దండుగోవిందు, గురుస్వామి, సూర్యనారాయణ, ప్రసాద్, అనిల్ పాల్గొన్నారు.

ఘనంగా ఎత్నిక్ డే

గుంతకల్లుటౌన్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శంకరానందగిరిస్వామి డిగ్రీ కళాశాలలో శనివారం ఎత్నిక్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యాపకులు, విద్యార్థినీవిద్యార్థులు తెలుగు సాంప్రదాయ వస్త్రధారణలతో హాజరరాయ్యరు. ఎత్నిక్ డేను కరెస్పాండెంట్ కేసీ హరికుమార్, డైరెక్టర్ గోపాల్ ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ భారతీయ సంస్కృతీ సాంప్రదాయాలను ప్రతి ఒక్కరూ గౌరవించాలన్నారు. మన దేశ సాంప్రదాయాలను పెంపొందించుటకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడుతాయన్నారు. తర్వాత విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలతో అలరించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

తాడిపత్రి, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని సజ్జలదిన్నె గ్రామసమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. యాడికి మండలం చందన గ్రామానికి చెందిన నాగరాజు బైక్‌పై తాడిపత్రికి బయలుదేరాడు. అలాగే సజ్జలదిన్నె గ్రామానికి చెందిన రవి తేజ కూడా బైక్‌పై తాడిపత్రి నుంచి స్వగ్రామానికి వస్తున్నాడు. అయితే సజ్జలదిన్నె క్రాస్‌లో వారిద్దరూ ఎదురెదురుగా ప్రమాదవశాత్తూ ఢీకొన్నారు. ఘటనలో ఇద్దరికీ గాయాలయ్యాయి. నాగరాజుకు తీవ్ర గాయాలవడంతో మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు.

నక్కలపల్లి గేటు వద్ద ఇద్దరికి..

బొమ్మనహాళ్‌: మండలంలోని నక్కలపల్లి గేటు వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇరువురికి తీవ్ర గాయాలయ్యాయి. ఆమిద్యాలకు చెందిన అక్కులప్ప, అజయ్ బైక్‌పై రాయదుర్గానికి బయలుదేరారు. బెళుగుప్పకు చెందిన తిప్పేస్వామినాయక్ బైక్‌లోనే పొలానికి వెళ్లి తిరిగి ఇంటికి వస్తున్నాడు. కాగా నక్కలపల్లి గేట్ వద్ద వారి బైక్‌లు ఎదురెదురుగా వచ్చి ప్రమాదవశాత్తు ఢీకొన్నాయి. దీంతో తిప్పేస్వామి నాయక్‌కు, అక్కులప్పకు గాయాలయ్యాయి. వారిని 108లో కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

డీ కొండాపురం సమీపంలో ముగ్గురికి ..

రాయదుర్గంరూరల్: మండలంలోని డీ కొండాపురం గ్రామ సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. టీ వీరాపురం గ్రామానికి చెందిన అశోక్, సోదరి గంగమ్మతో కలిసి బైక్‌పై కళ్యాణదుర్గం నుంచి స్వగ్రామానికి బయలుదేరారు. అలాగే కొండాపురం గ్రామానికి చెందిన రంజిత్ బైక్‌పై రాయదుర్గానికి వస్తున్నాడు. అయితే కొండాపురం వద్ద వారి బైక్‌లు ఎదురెదురుగా వచ్చి ఢీకొన్నాయి. ప్రమాదంలో ముగ్గురూ గాయపడ్డారు. వారిని స్థానికులు రాయదుర్గం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

200 ఎకరాల్లో వరి పంట నష్టం

యల్లనూరు, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో రెండురోజులుగా కురుస్తున్న వర్షానికి 200ఎకరాల్లో వరిపంట నష్టం జరిగినట్లు వ్యవసాయ అధికారి రామకృష్ణ శనివారం తెలిపారు. నష్టం జరిగిన ప్రతి రైతు పొలం వద్దకు వెళ్లి యాప్‌ద్వారా నష్టం వివరాలను నమోదు చేశామని చెప్పారు. సుమారు 50మంది రైతులు నష్టపోయినట్లు ఆయన పేర్కొన్నారు.

కాంగ్రెస్ ఇన్‌చార్జిగా సూర్యనారాయణరెడ్డి



తాడిపత్రి, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్‌పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా రెండోసారి సూర్యనారాయణరెడ్డి శనివారం బాధ్యతలు స్వీకరించారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఆయన బాధ్యతలు స్వీకరించారు. అనంతరం మాట్లాడుతూ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్‌షర్మిల తనపై నమ్మకం ఉంచి రెండవసారి అవకాశం కల్పించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషిచేస్తానని పేర్కొన్నారు.

సావనీర్ విడుదల

గుత్తి, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సీఎస్‌ఐ టౌన్ చర్చి శత వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా శనివారం చర్చి ఆవరణలో రెవరెండ్ ఐజాక్ వరప్రసాద్, సీడీ భారతి సావనీర్ పుస్తకాన్ని విడుదల చేశారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈప్రార్థనల్లో టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడుయాదవ్ పాల్గొన్నారు. చర్చి నిర్వాహకులు సల్మాన్, సురేంద్రబాబు, మనోరంజిత, జేమ్స్ వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మహాధర్నాను విజయవంతం చేయండి

గుంతకల్లుటౌన్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ కార్మిక, రైతు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఈనెల 26న కలెక్టరేట్ వద్ద మహాధర్నా జరగనుందని, విజయవంతం చేయాలని ప్రజా సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. పట్టణంలోని బీటీ పక్కీరప్ప భవనంలో శనివారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించి ఈ మేరకు మాట్లాడారు. ఏఐటీయూసీ వర్కింగ్ అధ్యక్షుడు సురేష్, జిల్లా అధ్యక్షుడు రాజేష్‌గౌడ్, ఐఎఫ్‌టీయూజిల్లా కార్యదర్శి సురేష్, సీఐటీయూ కార్యదర్శి శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చోరీలపై అప్రమత్తంగా ఉండండి

పుట్లూరు, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలో దొంగతనాలపై అప్రమత్తంగా ఉండాలని పుట్లూరు సీఐ సత్యబాబు రైతులకు సూచించారు. మడ్డిపల్లి గ్రామంలో శనివారం కేబుల్ చోరీ జరిగిన తోటలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ.. తోటలవద్ద అప్రమత్తంగా ఉండి, కొత్త వ్యక్తులపై నిఘా పెట్టాలన్నారు. గ్రామంలో ఎక్కువగా కేబుల్‌చోరీలు జరుగుతున్నాయన్నారు. తమ సిబ్బంది కూడా వాటిపై నిఘా పెడతారని తెలిపారు. సీఐ వెంట సిబ్బంది గోవిందురాజులు ఉన్నారు.



రైతులతో మాట్లాడుతున్న సీఐ సత్యబాబు

డబ్బులిస్తేనే.. వైద్యం

- కళ్యాణదుర్గం సీహెచ్‌సీలో సిబ్బంది చేతివాటం
- లబోదిబోమంటున్న రోగులు
- పట్టించుకోని ఉన్నతాధికారులు



కళ్యాణదుర్గంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్

కళ్యాణదుర్గం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : కళ్యాణదుర్గం పట్టణంలోని కమ్యూనిటీ హెల్త్‌సెంటర్ (సీహెచ్‌సీ) నియోజకవర్గంలోనే అతిపెద్ద ప్రభుత్వ ఆస్పత్రి. అయితే ఇక్కడ డబ్బులు ఇస్తేనే వైద్య సేవలందుతాయి.. లేకపోతే లేదన్న ఆరోపణలు ఉన్నాయి. కిందిస్థాయి సిబ్బంది డబ్బు ఇస్తేనే వైద్యం చేస్తామని మొహమాటం లేకుండా చెబుతూ రోగుల నుంచి వసూలు చేస్తున్నారు. ఇక్కడకు రోగి ఏదేని వైద్యం కోసం వస్తే తొలుత కింది స్థాయి సిబ్బందికి డబ్బు ముట్టజెప్పాల్సిందేనన్న విమర్శలు ఉన్నాయి. జనన, మరణ ధృవీకరణ పత్రాలకు అయితే ముక్కుపిండి మరీ వసూలు చేస్తున్నారని, ఇక సదరం క్యాంపులో ఇచ్చే సర్టిఫికెట్లకు ఎంత అడిగితే అంత డబ్బు ముట్టజెప్పాల్సిందేనని, ఒక్కో సదరం సర్టిఫికెట్‌కు రూ. 10 వేల నుంచి రూ. 15 వేల దాకా వసూలు చేస్తున్నారన్న విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. దీంతో రోగులు లబోదిబోమంటున్నారు. ఇటీవల ఔట్ సోర్సింగ్ కింద ఆపరేషన్ థియేటర్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్న శ్రీనివాసులు రోగి బంధువు నుంచి డబ్బు తీసుకుంటున్న దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అయిన విషయం తెలిసిందే. డబ్బులు తీసుకుంటున్న వీడియోలు వైరల్ అవ్వడం ఇక్కడ కొత్తేమీ కాదు. గతంలో కూడా ఫిజికల్ ఫిట్ నెస్ కోసం కింది స్థాయి సిబ్బంది డబ్బులు తీసుకుంటున్న వీడియో వైరల్ అయింది. అయినప్పటికీ సిబ్బందిలో ఏ మాత్రం మార్పు రాలేదు. తాజాగా ఆపరేషన్ థియేటర్ టెక్నీషియన్ వీడియో వైరల్ అయినప్పటికీ ఇక్కడ ఒరిగేదేమీ లేదని కింది స్థాయి సిబ్బంది తేలికగా కొట్టిపారేస్తున్నారు. అడిగేవారు లేకపోవడంతో కిందిస్థాయి సిబ్బంది ఆడిందే ఆట.. పాడిందే పాటగా వ్యవహరిస్తున్నారని, ఇక్కడ పని చేసే ఓ ఉన్నతాధికారి వారానికి కేవలం రెండు మూడు రోజులు మాత్రమే విధులకు వస్తుండటంతో పరిస్థితి అలా అయిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. డ్యూటీ డాకర్లు తోచిన విధంగా విధులు నిర్వహిస్తూ కిందిస్థాయి సిబ్బందిని గాడిలో పెట్టలేక పోతున్నారు. ఈ ఆస్పత్రిలో ప్రతి రోజూ 400 మందికి పైబడి రోగులు వస్తుంటారు. కంబదూరు, శెట్టూరు, కుందుర్పి, బ్రహ్మసముద్రం, కళ్యాణదుర్గం టౌన్, రూరల్ ప్రాంతాలకు అతి పెద్దదిగా ఈ ఆస్పత్రి మాత్రమే ఉండటంతో అందరూ ఇక్కడికి వస్తుంటారు. దీనిని ఆసరాగా చేసుకుని కింది స్థాయి సిబ్బంది వసూళ్లకు పాల్పడుతున్నారు. ఇది పేరుకే ప్రభుత్వాస్పత్రి అని.. ఇక్కడ ప్రతి పనికి డబ్బు ఇవ్వాల్సిందేనని రోగులు వాపోతున్నారు. కలెక్టర్ అయినా స్పందించి ఇక్కడ పరిస్థితిని మెరుగుపరచాలని వారు కోరుతున్నారు.

ఈ విషయమై వైద్యాధికారిణి ప్రసన్నభారతిను వివరణ కోరగా ఔట్ సోర్సింగ్ ఆపరేషన్ థియేటర్ టెక్నీషియన్ డబ్బు తీసుకుంటున్న వీడియో తన దృష్టికి వచ్చిందని, ఈ విషయంపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశామని అన్నారు. సిబ్బందితో కూడా ప్రత్యేక సమావేశం నిర్వహించి డబ్బులు వసూలు చేస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించామని తెలిపారు. తాను కూడా విధులకు సక్రమంగా వస్తున్నానని, భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కాకుండా చూసుకుంటామని పేర్కొన్నారు.

నిర్లక్ష్య సిబ్బందిపై చర్యలు తీసుకోండి

- జిల్లా వ్యవసాయాధికారికి రైతుల విన్నపం
- వారి అలసత్వంతో అర్హులకు అన్యాయం జరుగుతోందని మండిపాటు



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారిణి

కూడేరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వ్యవసాయ శాఖ సిబ్బంది రైతుల పట్ల తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారని, దీంతో అర్హులకు తీవ్ర అన్యాయం జరుగుతోందని పలువురు రైతులు మండిపడ్డారు. మండలకేంద్రంలోని రైతుసేవా కేంద్రంలో శనివారం కౌలు రైతుల సమావేశం జరిగింది. ఇందుకు జిల్లా వ్యవసాయశాఖ అధికారి ఉమామహేశ్వరమ్మ హాజరయ్యారు. తొలుత ఏవో విజయ్‌కుమార్ మాట్లాడుతూ.. కౌలు రైతులకు గుర్తింపు కార్డులతో పాటు బ్యాంకు రుణాలు, తదితర పథకాలను ఇచ్చేందుకు ప్రభుత్వం ఆదేశించిందని, అందుకు కూడేరు మండలంలో 50 మంది కౌలు రైతులను గుర్తించినట్లు తెలిపారు. దీంతో అక్కడే ఉన్న కొందరు రైతులు మాట్లాడుతూ.. గత వైసీపీ ప్రభుత్వంలో వ్యవసాయశాఖ సిబ్బంది రైతుల పట్ల తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శించారన్నారు. దీంతో అర్హులకు ఎటువంటి ఇన్సూరెన్స్, ఇన్‌పుట్ సబ్సిడీ రాలేదని మండిపడ్డారు. వ్యవసాయాధికారులు పంటపొలాలు చూడకుండా రైతు సేవా కేంద్రం సిబ్బంది ఇచ్చే సమాచారాన్ని ప్రభుత్వానికి పంపారని, అందువల్లే అర్హులైన రైతులకు అన్యాయం జరిగిందని వాపోయారు. ప్రస్తుతం కౌలు రైతుల ఎంపిక జాబితాలో అనర్హులు ఉన్నారని, ఈ ప్రభుత్వంలోనైనా అర్హులకు న్యాయం జరిగేలా చూడాలని జిల్లా అధికారి ఉమామహేశ్వరమ్మ దృష్టికి తీసుకెళ్లారు. మండలంలో నిర్లక్ష్యంగా పని చేసే వ్యవసాయశాఖ అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో లీడ్‌బ్యాంక్ మేనేజర్ నరసింహా రావు, వివిధ బ్యాంకుల అధికారులు పాల్గొన్నారు.

ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

యాడికి, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): ఫర్టిలైజర్స్ దుకాణాల్లో ఎరువులు, పురుగు మందులు అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని తాడిపత్రి ఏడీఏ చెంగళరాయుడు హెచ్చరించారు. మండలకేంద్రంతో పాటు రాయలచెరువు గ్రామంలో శనివారం ఆయన పలు ఫర్టిలైజర్స్ దుకాణాలను, స్టాక్ గోడౌన్‌లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎరువుల వివరాలు ఆన్‌లైన్‌లో, స్టాక్‌రిజిస్టర్‌లో, అలాగే గోడౌన్‌లో సమానంగా ఉన్నాయా లేదా అని పరిశీలించారు. అనంతరం షాపు యజమానులు, డీలర్లతో మాట్లాడుతూ రైతులు కొనుగోలు చేసిన వస్తువులకు తప్పనిసరిగా బిల్లులు ఇవ్వాలని సూచించారు. ఎరువులు ఎమ్మార్పీకే అమ్మాలని తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు. ఆయన వెంట ఏఓ మహబూబ్‌బాషా ఉన్నారు.

అనుమతి ఉన్న వైద్యులే సేవలందించాలి

- డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఈబీ దేవి



వైద్యశాలలో విచారిస్తున్న డీఎంహెచ్ఓ

పామిడి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ ఆసుపత్రులలో అనుమతి ఉన్న వైద్యుల చేతనే వైద్య సేవలందించాలని డీఎం హెచ్ఓ డాక్టర్ ఈబీ దేవి తెలిపారు. పట్టణంలోని ఎద్దులపల్లి రోడ్డులో గల ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో శనివారం ఆమె విచారణ చేపట్టారు. ఇటీవల ఓ యువకుడికి అందించిన వైద్య సేవలతో అస్వస్థతకు గురై కాలు పుండ్లు కావడంపై బాధితులు చేసిన ఫిర్యాదుపై ఆమె విచారణ చేపట్టారు. అనుమతి లేకుండా ఇతర వైద్యుడు వైద్య సేవలందించడంపై ఆమె మండిపడ్డారు. ఆ వైద్యుడిపై శాఖపరంగా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పూర్తిస్థాయిలో విచారించి న్యాయం చేస్తామని బాధితుడి కుటుంబానికి భరోసా కల్పించారు. కార్యక్రమంలో ఎద్దులపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి సుధాకర్ పాల్గొన్నారు.

గోకులం షెడ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలి

రాయదుర్గంరూరల్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ కింద మంజూరైన గోకులం షెడ్ల నిర్మాణాలు త్వరగా పూర్తయ్యేలా చూడాలని డ్వామా పీడీ సలీంబాషా ఉపాధి సిబ్బందికి సూచించారు. పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం ఆయన ఉపాధిహామీ సిబ్బందితో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రభుత్వం అర్హులకు గోకులం షెడ్లను మంజూరు చేసిందన్నారు. షెడ్ల నిర్మాణం నిర్లక్ష్యం కాకుండా త్వరితగతిన పూర్తి అయ్యేలా ఉపాధిహామీ అధికారులు, సిబ్బంది చొరవచూపాలన్నారు. మండలంలో 108 మంది దరఖాస్తు చేసుకోగా 75 మందికి గోకులం షెడ్లు మంజూరయ్యాయని, 38 మంది రైతులు షెడ్ల నిర్మాణం ప్రారంభించారని తెలిపారు. అదే విధంగా ప్రతి ఇంటి ముందు ఇంకుడుగుంతలు ఏర్పాటు చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. మండలంలో రైతులు పశుగ్రాసం కోసం దరఖాస్తు చేసుకోవాలని ఈ సందర్భంగా సూచించారు. ఏపీడీ అయేషా, ఎంపీడీఓ కొండన్న, ఏపీఓ విజయభారతి, ఈసీ భారతి, టీఏలు తదితరులు పాల్గొన్నారు.

కణేకల్లు: మండలంలోని గోపులాపురం, పూలచెర్ల గ్రామాల్లో పునాది స్థాయిలో ఉన్న గోకులం షెడ్ల నిర్మాణాలన పీడీ అల్లాబకాష్ పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. షెడ్ల నిర్మాణాన్ని వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయాలని అధికారులకు తెలిపారు. అలాగే ఉపాధిహామీ పథకంలో ప్రతి కూలీకి పనులు కల్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు స్ర్కీనింగ్ పరీక్షలు

పామిడి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని నాగిరెడ్డి కాలనీ గల ప్రభుత్వపాఠశాలలో విద్యార్థులకు శనివారం స్ర్కీనింగ్ పరీక్షలు నిర్వహించారు. ఎద్దులపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి సుధాకర్ ఆధ్వర్యంలో వైద్యసిబ్బంది ఈ పరీక్షలు చేశారు. వైద్యాధికారి మాట్లాడుతూ 18 ఏళ్ల లోపు వయసున్న పిల్లలందరికీ వ్యాధులు, వైకల్యాలను పూర్తిగా నిర్మూలించేందుకు ఈ స్ర్కీనింగ్ పరీక్షలు ఎంతగానో దోహదపడతాయన్నారు. తొలిదశలోనే వ్యాధులను గుర్తించి వైద్య సేవలందించేందుకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ప్రోగాం ఆఫీసర్ నారాయణస్వామి, డీఈఐసీ మేనేజర్ రజిత, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

విడపనకల్లు, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని అంచనహాలు గ్రామంలో కర్ణాటక మద్యంను ఎక్సైజ్ పోలీసులు శనివారం స్వాధీనం చేసుకున్నారు. గ్రామంలో తనిఖీలు నిర్వహిస్తుండగా దాసరి భార్గవ రాముడు అనే వ్యక్తి కర్ణాటక మద్యం విక్రయిస్తు కనిపించాడు. వెంటనే అతడి వద్ద నుంచి 136 టెట్రా ప్యాకెట్లు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు సీఐ రవిచంద్ర తెలిపారు. అనంతరం అతడిని ఉరవకొండ కోర్టుకు హాజరు పరిచి రిమాండ్‌కు తరలించామన్నారు. ఈ దాడుల్లో అసిస్టెంట్ కమిషనర్ సుహాసిని ఎస్ఐ పోతులయ్య సిబ్బంది పాల్గొన్నారు.

20లీటర్ల నాటుసారా..

గుంతకల్లు టౌన్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని పులగుట్టపల్లి క్రాస్ వద్ద రవినాయక్ అనే వ్యక్తి నుంచి 20లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ శివసాగర్ తెలిపారు. పులగుట్టపల్లిపెద్దతండాకు చెందిన రవినాయక్ నాగసముద్రం వెళ్లేందుకు పులగుట్టపల్లి క్రాస్ వద్ద ఉండగా.. దాడులు చేసి అతని వద్ద నుంచి 20లీటర్ల నాటుసారా, ఒక ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నామని, అనంతరం కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని సీఐ తెలిపారు. దాడుల్లో ఎస్ఐ వెంకటేశం, సిబ్బంది పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదుపై సమావేశం

బెళుగుప్ప, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండలకేంద్రంలో శనివారం టీడీపీ సభ్యత్వ నమోదుపై మండల కార్యకర్తలతో ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లికార్జున సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రమాద బీమా పాలసీతో కార్యకర్తల కుటుంబాల సంరక్షణకు టీడీపీ పెద్దపీట వేస్తోందని తెలిపారు. కనుక ప్రతిఒక్కరూ టీడీపీ సభ్యత్వ నమోదు చేసుకోవాలని సూచించారు. నాయకులు పెద్దతిప్పయ్య, రాము, దుద్దేకుంట తిమ్మప్ప, వీరాంజనేయులు, ప్రసాద్, సునీల్, విశ్వేశ్వరయ్య, జీవరత్నం, ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


చట్టాలపై అవగాహన సదస్సు

గుత్తి, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీలు చట్టాల పట్ల అవగాహన కలిగి ఉండాలని వక్తలు సూచించారు. పట్టణంలోని వసుధ ఫంక్షన్ హాల్లో శనివారం ఆంధ్రప్రదేశ్ క్రైం ఇన్విస్టిగేషన్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో ఎస్సీ,ఎస్టీలకు రాజ్యాంగం కల్పిస్తున్న చట్టాలపై అవగాహన సదస్సు జరిగింది. ఆర్డీఓ శ్రీనివాసులు, మున్సిపల్ కమిషనర్ జబ్బర్‌మియా, సీఐ వెంకటేశ్వర్లు, సీఐడీ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్‌రావు పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అలాగే బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కల్పిస్తున్న చట్టాలపై ఎస్సీఎస్టీలు సరైన అవగాహన కలిగి ఉండి న్యాయసేవలు పొందాలని సూచించారు. అలాగే ఆర్థికంగా, విద్యారంగంగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఈఓ ఆర్డీ శివాజీరెడ్డి, ఏఎస్‌డబ్ల్యూఓ రాధిక, ఎంఈఓ రవినాయక్, సీఐడీ సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐలు శంకర్‌నాయక్, ఉస్మాన్‌గని, శ్రావణి, వీఆర్వోలు, ఎస్సీఎస్టీ కులసంఘాల నాయకులు పాల్గొన్నారు.

తాగునీటి సౌకర్యం కోసం విరాళం

రాయదుర్గంరూరల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లాపురం గ్రామ సమీపంలో వెలసిన విప్రమలై లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో భక్తులకు తాగునీటి సౌకర్యార్థం ట్యాంకు నిర్మాణానికి రాయదుర్గం పట్టణానికి చెందిన డాక్టర్ ఎల్లప్ప సతీమణి పార్వతి రూ. 10 లక్షలు వితరణ చేశారు. ఇందుకు సంబంధించిన చెక్కును ఆమె ఆలయ కమిటీ గౌరవాధ్యక్షుడు రామ్మూర్తికి ఆలయం వద్ద శనివారం అందజేశారు. అనంతరం పార్వతమ్మ కుటుంబసభ్యుడు వాల్మీకి రవి ట్యాంకు నిర్మాణానికి భూమిపూజ నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు బీఎస్‌టీ తిప్పేస్వామి తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో యువరైతు మృతి



బొజ్జప్ప (ఫైల్)

కళ్యాణదుర్గంరూరల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): శెట్టూరు మండలం అడవి గొల్లపల్లిలో యువరైతు గుండెపోటుతో మృతి చెందాడు. యువరైతు గొల్ల బొజ్జప్ప (30) తనకున్న రెండెకరాల పొలంలో రాగి పంటను సాగు చేశాడు. కాగా శుక్రవారం రాత్రి పంటకు నీరు పెట్టి వచ్చి పడుకు న్నాడు. శనివారం ఉదయం ఎంతకీ లేవకపోవడంతో కుటుంబసభ్యులు వెంటనే చికిత్స నిమిత్తం కళ్యాణదుర్గం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. గుండెపోటుతోనే మృతి చెందాడని నిర్ధారించారు. మృతుడికి దాదాపు రూ. పది లక్షలు అప్పులు ఉన్నాయని, దీంతో నిత్యం మదనపడుతుండేవాడని కుటుంబసభ్యులు తెలిపారు. మృతుడికి భార్య యశోదమ్మ, ముగ్గురు ఆడపిల్లలు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి



మాట్లాడుతున్న ఆరో అదనపు జిల్లా న్యాయాధికారి శ్రీహరి

పామిడి, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన పెంచుకోవాలని జిల్లా ఆరో అదనపు న్యాయాధికారి, మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ శ్రీహరి సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం మహిళలకు చట్టాలపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయనతో పాటు సీనియర్ సివిల్ న్యాయాధికారి కాశీవిశ్వనాథ ఆచారి, మహిళా కమిషన్ సభ్యురాలు రోఖియాబేగం, ఎంపీడీఓ తేజోత్స్న, సీడీపీఓ ఢిల్లేశ్వరి హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రీహరి మాట్లాడుతూ... ప్రతి ఒక్కరూ తమ ప్రాథమిక హక్కులపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. అలాగే సామాజిక బాధ్యతగా మెలగాలన్నారు. ప్రస్తుత సమాజంలో ప్రతి ఒక్క మహిళ మహిళా చట్టాలను తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో లీగల్ సర్వీసెస్ రీసోర్స్ పర్సన్స్ గంగాధర్ కుమార్, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక టిప్పర్లు సీజ్

యాడికి, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్న రెండు టిప్పర్లను శనివారం సీజ్‌చేసినట్లు సీఐ ఈరన్న తెలిపారు. రాయలచెరువు గ్రామం చందన గేటు వద్ద వాహనాల తనిఖీ చేస్తుండగా కడపజిల్లా ఏటూరు కొండాపురం వద్ద గల చిత్రావతి నది నుంచి నంద్యాల జిల్లా డోన్‌కు అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు టిప్పర్‌లను గుర్తించి సీజ్‌చేసినట్లు చెప్పారు. టిప్పర్ల యజమానులు, డ్రైవర్లు కొండయ్యగారి కిశోర్, సిద్రామ్ సాంబశివారెడ్డి, తమ్మినేని రాజశేఖర్‌నాయుడు, నడిపినేని రాజశేఖర్‌లపై కేసు నమోదుచేసినట్లు సీఐ పేర్కొన్నారు.

ఆలయాల్లో కార్తీకమాస పూజలు



ప్రత్యేకాలంకరణలో ఆంజనేయుడు

రాయదుర్గంరూరల్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని వడ్రవన్నూరు సమీపంలో వెలసిన అప్పలాపురం ఆంజనేయస్వామి, మల్లాపురం సమీపంలో వెలసిన విప్రమలై లక్ష్మీనరసింహస్వామి ఆలయాల్లో శనివారం కార్తీక ప్రత్యేక పూజలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు వేకువజామునే మూలవిరాట్‌లకు ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు, పూజలు జరిపారు. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి స్వాములను దర్శించుకుని అర్చనలు చేయించారు.

వైభవంగా పల్లకీసేవ

ఉరవకొండ: మండలంలోని పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో పల్లకీ సేవను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు తొలుత ఆలయంలో మూలవిరాట్‌లకు ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు, పూజలు జరిపారు. తర్వాత ఉత్సవమూర్తిని పట్టువస్త్రాలతో అలంకరించి పల్లకిలో కొలువుదీర్చారు. మేళతాళాల మధ్య ఆలయం చుట్టూ ఊరేగించారు. కార్తీక మాసం కావడంతో భక్తులు పెన్నా నదిలో స్నానాలు ఆచరించి స్వామి వారిని దర్శించుకున్నారు.

విగ్రహాల ఏర్పాటుకు స్థలాల పరిశీలన



స్థలాల పరిశీలనలో జేసీపీఆర్

తాడిపత్రి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు ప్రాంతాల్లో వివిధ విగ్రహాలను ఏర్పాటు చేసేందుకు గాను శనివారం మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి స్థలాలను పరిశీలించారు. స్థానిక ఫ్లైఓవర్ వద్ద 20 అడుగుల శివుడి విగ్రహం, చుక్కలూరురోడ్డులోని పెట్రోల్ బంక్ సర్కిల్లో గ్రానైట్ కార్మికుడి విగ్రహం, సజ్జలదిన్నె పాతబ్రిడ్జి సర్కిల్లో హిందూ, ముస్లిం, క్రైస్తవ మతాలకు చెందిన చిహ్నాలు, కడపరోడ్డులోని ఐశ్వర్యవిల్లాస్ సమీపంలో పచ్చదనం కనిపించే చిహ్నాలను ఏర్పాటు చేయనున్నారు. శివుడి విగ్రహానికి రూ.20 లక్షలు, గ్రానైట్ కార్మికుడి విగ్రహానికి రూ.16లక్షలు, మతాల చిహ్నాలకు రూ.18లక్షలు, పచ్చదనం చిహ్నాలకు రూ.16లక్షలు ఖర్చుచేయనున్నారు. మొత్తం ఈ విగ్రహాల ఏర్పాటుకు జేసీపీఆర్ రూ.70లక్షల సొంత నిధులను ఖర్చుచేయనున్నారు. విగ్రహాలను తయారుచేసే పనిని రాజమండ్రికి చెందిన ప్రముఖ శిల్పి నరేంద్రకు అప్పగించారు. దశలవారీగా విగ్రహాల ఏర్పాటుకు సంబంధించి పనులను ప్రారంభించనున్నారు. ఆయన వెంట శిల్పి నరేంద్ర, టీడీపీ నాయకులు ఎస్వీ రవీంద్రారెడ్డి, పవన్‌కుమార్‌రెడ్డి, హరినాథ్‌రెడ్డి, లోకనాథ్‌రెడ్డి, నరేంద్రనాయుడు, సుదర్శన్, తిరుపాల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

సహకార సంఘం ఓటర్లు 4,201

పుట్లూరు, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలో సహకార సంఘానికి సంబంధించిన మొత్తం ఓటర్లు 4201 మంది ఉన్నట్లు తహసీల్దార్ శేషారెడ్డి శనివారం ప్రకటనలో తెలిపారు. అందులో 2942మంది పురుష ఓటర్లు, 1258మంది మహిళా ఓటర్లు ఉన్నట్లు చెప్పారు. త్వరలో ఎన్నికలు జరగనుండడంతో నూతన జాబితాను తయారు చేశామన్నారు. ఇప్పటికే ఆయా గ్రామాల్లో ఓటర్ల జాబితా ప్రదర్శించామని, అభ్యంతరాలు ఉంటే ఫిర్యాదులు చేయవచ్చునని ఆయన సూచించారు.

నిధుల కేటాయింపు హర్షణీయం

గుత్తి, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): క్రైస్తవుల సంక్షేమ కోసం రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో నిధులు కేటాయించడం హర్షణీయమని టీడీపీ క్రిష్టియన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఈటే స్వామిదాసు పేర్కొన్నారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తొలి బడ్జెట్ సమావేశంలోనే కూటమి ప్రభుత్వం క్రిష్టియన్ మైనార్టీల సంక్షేమ కోసం రూ.151కోట్లు కేటాయించడం హర్షణీయమన్నారు. అదే విధంగా క్రైస్తవుల జెరుసలెం యాత్రకు, విదేశీ విద్యకు, సబ్సిడీ రుణాలకు, పాస్టర్ల గౌరవవేతనం ఇవ్వడానికి ప్రభుత్వం సానుకూలత తెలపడం పట్ల సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వంలో క్రిష్టియన్ కార్పొరేషన్‌ను నిర్వీర్యం చేశారని ఈ సందర్భంగా ఆయన మండిపడ్డారు.

మహాసభల పోస్టర్ల విడుదల

ఉరవకొండ, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): విజయనగరంలో ఈ నెల 27 నుండి 30వ తేదీవరకూ ఏఐఎస్ఎఫ్ 49వ రాష్ట్ర మహాసభలు జరగనున్నాయని, విజయవంతం చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు హనుమంతరాయుడు పిలుపునిచ్చారు. ఇందుకు సంబంధించిన పోస్టర్లను పట్టణంలోని సాంఘిక సంక్షేమ హాస్టల్‌లో శనివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పీజీ విద్యార్థులకు శాపంగా ఉన్న జీవో నెంబర్ 77ను రద్దు చేయాలని , రాష్ట్ర వ్యాప్తంగా యూనివర్సిటీల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు చందు, రాజు, లెనిన్, రాజేష్, కరుణాకర్, సాధిక్ పాల్గొన్నారు.

పేర్లు నమోదు చేయించుకోండి

బెళుగుప్ప, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : బోరుబావులు ఉన్న రైతులు రబీలో వేరుశనగ సాగు చేయడానికి విత్తన వేరుశనగ కోసం పేర్లు నమోదు చేయించుకోవాలని ఏవో పృథ్వీసాగర్ శనివారం ప్రకటనలో తెలిపారు. మండలానికి 300 క్వింటాళ్ల విత్తన వేరుశనగ మంజూరైందన్నారు. 40 శాతం సబ్సిడీతో అందించనున్నామన్నారు. రైతులు క్వింటాల్‌కు రూ. 5760లు చెల్లించాల్సి ఉంటుందన్నారు. అర్హులు ఆధార్ కార్డు, పట్టాదారు పాసుపుస్తకం, బోరుబావి కరెంటు బిల్లు తీసుకెళ్లి రైతు సేవా కేంద్రాల్లో పేర్లు నమోదు చేయించుకోవాలని సూచించారు.

గ్రామాల్లో సమస్యలు పరిష్కరించండి

కూడేరు, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఎంపీపీ నారాయణరెడ్డి అధికారులను కోరారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో శనివారం ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వ సభ్య సమావేశం జరిగింది. తొలుత ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీటిసమస్య రాకుండా సంబంధితాధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఇంకా మౌలిక వసతులు కల్పించాలని కోరారు. ప్రభుత్వం గోకులం షెడ్లు అర్హులందరికీ మంజూరు చేయాలని పలువురు సభ్యులు విన్నవించారు. కొర్రకోడు గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని సర్పంచు చంద్రశేఖర్ సభ దృష్టికి తీసుకొచ్చారు. సమావేశంలో జడ్పీటీసీ సభ్యురాలు అశ్విని, వైస్‌ఎంపీపీలు దేవా, సుబ్బమ్మ, ఎంపీడీఓ కుళ్లాయి స్వామి, ఏఓ విజయ్‌కుమార్, వెటర్నరీ డాక్టర్ శ్రీనివాసులు, ఏపీఓ తులసీ ప్రసాద్, ఏపీఎం దిలీప్, ఎంఈఓ మహమ్మద్‌గౌస్, డిప్యూటీ తహసీల్దార్ సూర్యప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

కొలువుదీరిన కడ్లే గౌరమ్మ



బసవేశ్వరాలయంలో కొలువుదీరిన కడ్లే గౌరమ్మ

విడపనకల్లు, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో కడ్లే గౌరమ్మ పూల రథోత్సవ వేడుకల్లో భాగంగా శనివారం స్థానిక బసవేశ్వరాలయంలో అమ్మవారిని కొలువుదీర్చారు. ఉదయం అర్చకులు ధ్వజారోహణం చేసిన అనంతరం శనగ పిండితో గౌరి దేవిని ప్రతిమను తయారు చేసి కొలువుదీర్చారు. తర్వాత సనాతన సాంప్రదాయం ప్రకారం పింజరి మస్తాన్ సాబ్ ఇంటి నుంచి తెచ్చిన వడి బియ్యంను అమ్మవారికి సమర్పించి తమల పాకులు పూజలు నిర్వహించారు. మహిళలు పెద్దఎత్తున వచ్చి పూజలు చేశారు.

బొమ్మనహాళ్: మండలంలోని శ్రీధరఘట్ట, ఉద్దేహాళ్, ఉంతకల్లు గ్రామాల్లో గజగౌరీదేవికి భారీ ఎత్తున చక్కెర హారతులు ఇచ్చారు. మండపాల్లో, శివాలయాల్లో కొలువుదీర్చిన గజగౌరీదేవికి యువతులు, మహిళలు చక్కెరహారతులు ఇచ్చి నూతన వస్త్రాలు, పసుపు,కుంకుమ, గాజులు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.